తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సంపుటి : 2 | సంచిక : 288 | మంగళవారం | 18 - 03 - 2025 | పేజీలు : 8 | వెల : 5.00 | www.telanganamuchatlu.in

# గాంధీ భవన్ కాదు.. అసెంబ్లీ..?



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సభ నిర్వహణపై ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా.. అధికార పక్షానికే ఎక్కువ సమయం కేటాయించడాన్ని ఓవైసీ తప్పుబట్టారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. సభలో మాట్లాడుదామంటే మైక్ ఇవ్వరు. అధికార పక్షం ఇలా చేయడం మంచిది కాదు. శాసనసభను నడపడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదు. ప్రశ్నలు కూడా మార్చుతున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ సభ నుంచి వాకౌట్ చేస్తున్నాం. ఇది గాంధీ భవన్ కాదు.. అసెంబ్లీ అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. అసెంబ్లీని అసెంబ్లీలా నడపండి.. గాంధీ భవన్‌లా కాదు అని ఎమ్మెల్యే ఓవైసీ సూచించారు.




# కరీంనగర్‌కు నీటి సమస్య ముప్పు..?

- రైతులకు సాగునీరు అందిస్తుండడంతో జలాశయాలు ఖాళీ..!
- రోజుకు అర టిఎంసి 6 వేల క్యూసెక్కుల రైతులకు సాగు నీరు అందిస్తున్నారు..
- కరీంనగర్ సిద్దిపేట జిల్లా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు వచ్చే అవకాశం..!
- ఇప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు వచ్చే పరిస్థితి లేదు
- ఎడారిగా మారనున్న ఎల్ఎండీ?

**కరీంనగర్, తెలంగాణ ముచ్చట్లు :**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు నీటి సమస్య ముప్పు ముంచుకొస్తుంది. జలాశయాల్లో శరవేగంగా నీటి మట్టాలు ఘననీయంగా పడిపోతున్నాయి. ఎండవేడి వడగాడ్పులతో పంట నహాపొలాలు తడారి ఎండి పోతున్నాయి. సాగు నీరు అందించి ఎండుతున్న పంటలను కాపాడాలని రైతులతోపాటు రాజకీయ పార్టీలు ఆందోళన బాట పట్టాయి. దీంతో పంటలను కాపాడేందుకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా నీటి విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తుండడంతో జలాశయాలు ఖాళీ అవుతున్నాయి. ఈ నెలాఖరు వరకు సాగునీరు ఇవ్వాలని సర్కారు నిర్ణయించడంతో ప్రస్తుతం ఉన్న నీళ్ళు వారం పదిరోజుల్లో ఖాళీ అయ్యే పరిస్థితులు కనిపిస్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది.కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేర్ డ్యామ్ నీటి నిలువ సామర్థ్యం 24 టిఎంసీలు కాగా ప్రస్తుతం 9టిఎంసి నీళ్ళు మాత్రమే ఉన్నాయి. రోజుకు అర టిఎంసి 6వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కెనాల్ ద్వారా రైతులకు సాగు నీరు అందిస్తున్నారు. ఎల్ఎండికి ఎగువన ఉన్న మిడ్ మానేర్ నుంచి 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ఎల్ఎండి నుంచి ఆరు వేల క్యూసెక్కుల నీటిని సాగు నీరుగా కాకతీయ కాలువకు విడుదల చేస్తుండగా 300 క్యూసెక్కుల నీళ్ళు మిషన్ భగీరథతో పాటు ఎండ వేడికి ఆవిరైపోతున్నాయి. ఇదే మాదిరిగా సాగునీరు ఇస్తే నాలుగు రోజులకు ఒక టిఎంసి చొప్పున ఈ నెలాఖరు వరకు 4 టిఎంసిల నీళ్ళు ఖాళీ అయి ఎల్ఎండిలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరనుంది. కరీంనగర్ సిద్దిపేట జిల్లా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్ మొదటి వారంలోనే డెడ్ స్టోరేజ్ నుంచి త్రాగునీరు తీసుకునే పరిస్థితి ఉంటే? మే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన వ్యక్తం అవుతుంది.రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న మిడ్ మానేర్ శ్రీ రాజరాజేశ్వర జలాశయం పూర్తి స్థాయి నీటి నిలువ సామర్థ్యం 27 టిఎంసిలు. ప్రస్తుతం 12.5 టీఎంసీల నీళ్ళు ఉన్నాయి. మిడ్ మానేర్‌కు ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా 660 క్యూసెక్కుల నీరు వస్తుండగా మిడ్ మానేర్ నుంచి 2500 క్యూసెక్కుల నీటిని దిగువన ఎల్ఎండి కి మరో 650 క్యూసెక్కుల నీటిని రైట్ మేయిన్ కెనాల్‌కు విడుదల చేస్తున్నారు. మరో 220 క్యూసెక్కుల నీళ్ళు ఆవిరైపోతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.ఇదే మాదిరిగా ఎండలు ముదిరి నీటిని విడుదల చేస్తే మార్చి మాసాంతం వరకు మిడ్ మానేర్‌లో సైతం భారీగా నీళ్ళు తగ్గనున్నాయి. ఇప్పటికే మిడ్ మానేర్‌పై ఆధారం పడ్డ వేములవాడ సిరిసిల్ల మానకొండూర్ నియోజకవర్గాల్లో సాగునీరు అందక వేలాది ఎకరాల్లో పంట పొలాలు ఎండిపోయి రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఉమ్మడి జిల్లాకు జీవనాదారంగా ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో సైతం నీటిమట్టం గణనీయంగా తగ్గింది. 20 టిఎంసీల నీటి నిలువ సామర్థ్యం గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 10టిఎంసిల నీళ్ళు ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో త్రాగునీటి అవసరాలకు ఆ నీళ్లు సరిపోయే అవకాశం ఉంది. వాటిని పొదుపుగా వర్షాకాలం ప్రారంభం అయ్యే వరకు ఉపయోగించుకోవాల్సిన పరి స్థితి నెలకొంది.ప్రస్తుతం ఎల్ఎండీ, మిడ్ మానేర్‌లో ఘననీయంగా నీటిమట్టం పడిపోతుండడంతో ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోసి సాగునీరు దేవుడెరుగు కనీసం త్రాగునీటి తిప్పల రాకుండా చూడాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు. ముంచుకొస్తున్న..

■ మిగతా 4లో..

## అసెంబ్లీలో బీసీ

# రిజర్వేషన్ బిల్లు..!

**హైదరాబాద్, మార్చి 17, తెలంగాణ ముచ్చట్లు :**



రిజర్వేషన్ల సాధనకు తాను నాయకత్వం వహిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కలిసి కట్టుగా అందరం ప్రధాని మోదీ వద్దకు వెళ్దామని ఆయన అన్ని పార్టీలకు పిలుపు నిచ్చారు. ఆ క్రమంలో ప్రధాని మోదీ అపాయింట్ మెంట్ ఇప్పించాలని కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో తాము రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ సైతం తీసుకుంటామన్నారు. ఈ బిల్లు కోసం లోక్ సభలో పోరాటం చేయాలని ఆయనను కోరతానని తెలిపారు. ఇక బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సైతం కలిసి రావాలని కోరుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వివాదాలకు తావు లేకుండా బలహీన వర్గాలకు న్యాయం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. మంగళవారం అసెంబ్లీలో ఆమోదానికి బీసీ రిజర్వేషన్ బిల్లు వచ్చింది. ఈ బిల్లు ఆమోదం కోసం చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించి.. ఈ బిల్లు పెట్టామని పేర్కొన్నారు. అలాగే రాజకీయంగానూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. బీసీలకు రిజర్వేషన్లపై పార్టీలకతీతంగా ఐక్యంగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 1979లోనే ఈ రిజర్వేషన్ల కోసం మండల్ కమిషన్ వేశారని గుర్తు చేశారు. మండల్ కమిషన్‌తోనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత అని ఆయన గుర్తు చేశారు. కులగణన, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఏడాది లోపు పూర్తి చేస్తామని చెప్పారు. రిజర్వేషన్లపై కేంద్రం అంగీకారం కోసం పోరాడతామని వెల్లడించారు. తెలంగాణలో 56.36 శాతం బలహీనవర్గాలు ఉన్నాయని వివరించారు. బలహీనవర్గాలకు అండగా నిలబడాలనే.. కామారెడ్డి సభలో డిక్లరేషన్ పెట్టామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత..

■ మిగతా 4లో..



## తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు

# లేఖలకు తిరుమల దర్శన అనుమతి

**- చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన తుమ్మల**

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

తిరుమల దర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలను ఆమోదించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు అంగీకరించింది. ఈ నెల 24వ తేదీ నుండి ఈ అమలు ప్రారంభం కానుంది. తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖల ద్వారా భక్తులకు తిరుమల దర్శనం కల్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో, ఈ నిర్ణయం అమల్లోకి రానుంది.ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు, పాలకమండలి సభ్యులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

## అసెంబ్లీని ముట్టడించిన

# బీఆర్ఎస్వీ శ్రేణులు..




**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

ఎన్నో ఉద్యమాలకు వేదికైన ఉస్మానియా యూనివర్సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. పోరాటాలకు ఊపిరిలూదిన విద్యార్థిలోకంపై కక్షగట్టింది. ఏకంగా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలో ఆందోళనలపై నిషేధం విధించిన నేపథ్యంలో బీఆర్ఎస్వీ శ్రేణులు అసెంబ్లీని ముట్టడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్లకు బీఆర్ఎస్వీ శ్రేణులను తరలించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఓయూ వీసీ ఇచ్చిన సర్క్యూలర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక ప్రజా ఉద్యమాలకు వేదిక అయిన ఓయూలో విద్యార్థులు నిరసన కార్యక్రమాలు రద్దు చేయడం అన్యాయం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి దొడ్డి దారిన రావచ్చు.. కానీ ఓయూ విద్యార్థులు విద్య, నిరుద్యోగ సమస్యల మీద ప్రశ్నిస్తే తప్పా? అని గెల్లు శ్రీనివాస్ యాదవ్ నిలదీశారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్వీ శ్రేణులు నినాదాలు చేశారు.

## అక్రమ కేసులతో జైల్లో వేయడమే

# ఇందిరమ్మ రాజ్యమా?



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

ఆడబిడ్డలను అక్రమ కేసులతో జైల్లో వేయడమే ఇందిరమ్మ రాజ్యమా..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో అరెస్టైన మహిళా జర్నలిస్టులు రేవతి, తన్వి యాదవ్‌లను చంచల్‌గూడ జైల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, డా. దాసోజు శ్రవణ్ తదితర బీఆర్ఎస్ సీనియర్ నేతలతో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ చెప్పిన ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రజలంతా అదేదో సంక్షేమ రాజ్యం అని భ్రమపడ్డారు. కేసీఆర్ కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందేమోనని అపోహ పడ్డారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తుంటే ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ రోజులని గుర్తు తెచ్చేలా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు అంతా భావిస్తున్నారు. ఓపెన్‌గా మాట్లాడుకుంటున్నారు. 420 హామీలను ఇచ్చి తమని మోసం చేసి కాంగ్రెస్ గద్దెనెక్కిందని ప్రజలు తమ ఆక్రోశాన్ని వెలిబుచ్చుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి అర్థం కావడానికి ఆయన మాట్లాడే బజారు భాషలోనే మాట్లాడితే బాగుంటుందని కొంతమంది సామాన్యులు కూడా అదే భాషను ఉపయోగిస్తున్నారు. రాహుల్ గాంధీ చెప్పిన మొహబ్బత్‌కి దుకాన్ ఇదేనా అని ఇవాళ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జనం నిలదీస్తే.. ప్రజలు ప్రశ్నిస్తే జర్నలిస్టులపై ఉక్కు పాదం మోపుతారా? జర్నలిస్టులను జైలుకు పంపుతారా? ఒకరిద్దరు జర్నలిస్టులను కాదు పదుల సంఖ్యలో జర్నలిస్టులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులతో వేధిస్తుంది. ప్రభుత్వం మీద ప్రజల్లో ఉన్న అసహనాన్ని చూపిస్తున్నందుకే యూట్యూబ్..

■ మిగతా 4లో..

## తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్

# ఫలితాలు విడుదల..

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫలితాలు విడుదలయ్యాయి. ప్రొవిజినల్ సెలక్షన్ లిస్ట్‌ను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. మొత్తం 574 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఈ సందర్భంగా టీజీపీఎస్సీ ప్రకటించింది. తుది జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో (https://www. tspsc.gov.in) చెక్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. కాగా.. గత ఏడాది జూన్ 24 నుంచి 29 తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్షలు జరిగాయి. కంప్యూటర్ ఆధారీతంగా రాత పరీక్షలు నిర్వహించారు. మొత్తం 581 పోస్టులకు గాను 82,873 మంది పరీక్షకు హాజరయ్యారు. కాగా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళాశిశు సంక్షేమశాఖల పరిధిలోని వసతి గృహాల్లో 562 హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, శిశు సంరక్షణ గృహాల్లో 19 మహిళా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్‌లో కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. గతేడాది (2024) జూన్‌లో పరీక్షలు జరుగగా... ఇప్పటికే జీఆర్ఎల్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది. నాలుగు విడుతల్లో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసింది. తాజాగా తుది ఫలితాలు విడుదలయ్యాయి.

# యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే యూజీసీ నూతన సంస్కరణలను వ్యతిరేకించండి




**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ నూతన సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలలో గవర్నర్ల ద్వారా నేరుగా వీసీల నియామకాలను చేపట్టడం అంటే యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని హక్కులను కాలరాయడమేనని పిడిఎస్‌యు మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు కందుకూరి పవన్ కుమార్ అన్నారు. సోమవారం పిడిఎస్‌యు వనపర్తి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో యుజిసి నూతన సంస్కరణలకు వ్యతిరేకంగా తేదీ. మార్చి 26 పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన గోడ పత్రికలను వనపర్తి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లో ఆయన ఆవిష్కరించడం జరిగింది. అదేవిధంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 90 శాతం మంది పేద వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులు ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదువుకుంటున్నారని యు జి సి నూతన సంస్కరణలు ఉన్నత విద్యను వీరికి దూరం చేయనున్నాయని అన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలకు యూజీసీ అభివృద్ధి నిధులు ఫెలోషిప్‌లో వివిధ రీసెర్చ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి విద్యార్థులకు తోడ్పాటు అందించేదని కానీ గత పదేళ్ల బిజెపి పాలనలో ఎస్సీ, ఎస్టీ ,బీసీ విద్యార్థులకు ఫెలోషిప్ల కోత పెట్టిందని యూనివర్సిటీలో అభివృద్ధికి బడ్జెట్ను కేటాయించకుండా పేద దళిత గిరిజన వర్గాల విద్యార్థులను యూనివర్సిటీ క్యాంపస్‌లోకి రాకుండా అడ్డుకుంటుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి సాయి కృష్ణ కమిటీ సభ్యులు రాకేష్,ప్రవీణ్ బీచ్‌పల్లి, రాఘవేంద్ర నరేష్ రెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఆంజనేయులు,కార్తీక్ తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే రాములు వారి
# తలంబ్రాలు

**-ఆర్టీసీ ఆర్.ఎం. సరీరామ్.**



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు శుభవార్త భద్రాచలంలో ఈ సంవత్సరం ఏప్రిల్ 6న జరగబోవు శ్రీ సీతారాముల వారి కల్యాణాన్ని పురస్కరించుకొని అక్కడకు వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కార్గో ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఇంటి వద్దకే పంపించే ఏర్పాటు చేయడం జరిగిందని ఖమ్మం టీజీఎస్ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. ఇందుకుగాను ఒక్కొక్క ప్యాకెట్‌కు 151 రూపాయి ఆన్లైన్ లేదా అన్ని బస్టాండ్ సెంటర్లు, ఏజెంట్ కౌంటర్ల వద్ద గాని బుక్ చేసుకోవచ్చని అన్నారు. కావున ప్రజలందరూ స్వామివారి కళ్యాణ తలంబ్రాల ద్వారా సీతారామ స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఇట్టి తలంబ్రాలు బుకింగ్ కొరకు భక్తులు క్రింద ఇవ్వబడిన ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

ఖమ్మం : 91542 98583
మధిర : 91542 98584
సత్తుపల్లి : 9154298585
భద్రాచలం : 9154298586
కొత్తగూడెం : 9154298587
మణుగూరు : 91542 98588
ఇల్లందు : 9154298587



## పదవ తరగతి విద్యార్థులకు
# ప్యాడ్స్ స్టేషనరీ పంపిణీ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు**
రమజాన్ ఆధ్వర్యంలో చింతకాని మండలం నేరడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్‌సి విద్యార్థులకు ప్యాడ్స్, స్కేల్స్ ,పెన్సిల్ మరియు ఇతర స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా షైక్ రంజాన్ మాట్లాడుతూ విద్యార్థినులు మంచిగా చదివి పరీక్షలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు .అదే విధంగా ఈ సమయంలో ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా ధైర్యంగా ఉండి పరీక్షలు రాయాలన్నారు. పిల్లలు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అదేవిధంగా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల మెలుకువలు తెలియజేశారు. రంజాన్ ఒక సాధారణ ఆటోడ్రైవర్ తనకి ఇలాంటి ఆలోచన వచ్చి పిల్లలకి సహాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు రంజాన్ ని అభినందించారు. ప్రతి ఒక్కళ్ళు రంజాన్‌ను ఆదర్శంగా తీసుకొని ఏదో ఒక విధంగా గ్రామానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఉండాలని ప్రజలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల శ్రీనివాసరావు, ఇతర పాఠశాల సిబ్బంది, పగిళ్లపల్లి గణేష్, షేక్ సాదిక్, అన్నపురెడ్డి మనోహర్ పాల్గొన్నారు.

## తెలుగు విశ్వ విద్యాలయమునకు పొట్టి శ్రీరాములు
# పేరును పునరుద్ధించాలి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం ఆర్‌జెసి., కళాశాల ఆవణలో 3టౌన్ కార్పోరేటర్స్ మరియు ఇతర ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల సందర్భములో వారి పేరును తొలగించి ఆర్యవైశులను అవమాన పరిచారని తెలియజేసారు. ఆంధ్రుల పేరు మీద ఉన్న పార్కులు మరియు స్టేడియంల పేర్లను మార్చగలరా, ట్యాంక్బండ్పై ఉన్న ఆంధ్రుల విగ్రహాలను తొలగించగలరా అని ప్రశ్నించారు. ఖమ్మంలో ఉన్న ఆర్యవైశుల మనోభావాలు దెబ్బతినేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తించిందని, ఇప్పటికైన ఈ తప్పును తెలుసుకొని తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్స్ తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, రవి నాయక్, శ్రీకాంత్, పాపారావు, ముక్కాల రాజేష్, బోజడ్ల రామమోహన్, యాత్రా అప్పారావు, పసుమర్తి రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో టెన్త్ పరీక్షలు షురూ

**విజయవాడ, తెలంగాణ ముచ్చట్లు :**
ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమైయాయి. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరగ నున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్ష జరగ నుంది. పరీక్ష ప్రారంభమయ్యే వర కూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిం చనున్నారు. ఇందుకోసం 3,450 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పదోతరగతి పరీక్షల్లో మొత్తం 6,19,275 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ప్రాథమిక విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ముప్పయి స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

# ఆశ కార్యకర్తలకు 18 వేల వేతనాలు ఇవ్వాలి



**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**
పెద్దమందడి మండల కేంద్రంలోని సోమవారము ఆశా వర్కర్లు తమకు 18 వేల వేతనం ఇవ్వాలని తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆశ వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిజా దేవి మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారంగా రాష్ట్ర ప్రభుత్వం 18000 వేల రూపాయల వేతనం ఇవ్వాలని ఆశ కార్యకర్తలు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలంటూ 15 రోజుల సమ్మె సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 18వేల వేతనం చేస్తామంటూ మేనిఫెస్టోలో పొందు పరిచిన హామీని అమలు చేయాలంటూ సోమవారం తహసిల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో మండల ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశాలకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశ వర్కర్ల సంఘం కార్యదర్శి గిరిజ దేవి, పెద్దమందడి మండలం అధ్యక్షురాలు రాధమ్మ, బాలమణి ,దొడగుంటపల్లి పద్మ,ఉమాదేవి,లక్ష్మి, కళావతి, జ్యోతి , బండి సుగుణ, కాజమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన యాదవ సంఘం సోదరులు



**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు :**
పెద్దమందడి మండలం అల్వాల్ గ్రామంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచి గోపాలకృష్ణ యాదవ సంఘం సోదరులు మానవత్వం చాటుకున్నారు. ఇటీవలే వారి గ్రామంలో విద్యుత్ సర్క్యూట్ వల్ల వారం రోజుల క్రితం నిరుపేద కుటుంబమైన నక్క ఆంజలమ్మ గుడిసె కాలి బూడిదైపోయేంది. అలాగే మార్చ్ 11 వ తేదిన మంగళవారం అదే గ్రామం లో వ్యక్తి ఎరుకలి భీమన్న (42)ప్రమాదవశత్తు ఆకస్మిక మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తోటి గ్రామస్థుల కుటుంబలు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో వారికి తోచిన సహాయంగా, సోమవారం ఉదయం గ్రామంలోని శ్రీ గోపాలకృష్ణ యాదవ సంఘం సోదరులు మృతుడి కుటుంబానికి, అలాగే గుడిసె కాలిన బాధిత కుటుంబాలను పరామర్శించి, ఇరువురి కుటుంబాలకు ఐదైదు వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు గూడెం భీమన్న యాదవ్, సంఘం కార్యదర్శులు పసుల సాయిలు యాదవ్, కొత్తగోళ్ళ శ్రీనివాస్ యాదవ్,కురుమూర్తి యాదవ్, పాలెం కృష్ణాయ యాదవ్, టంకరి రాములు, ఏర్పాల బాలకృష్ణ, పశుల శ్రీనివాస్ యాదవ్, బొందాల కురుమూర్తి యాదవ్,నక్క కురుమూర్తి యాదవ్ ,ఏర్పుల తిరుపతయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు అండగా ఉన్న యాదవ సంఘ సోదరులను గ్రామ పెద్దలు అభినందించారు.

# ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలను భర్తీ చేయాలి



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు తెలంగాణాలో ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 1,2,3 అన్ని ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల ఖమ్మం ఎదురుగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి రత్నాకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్షలో సోమవారం పీజీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తడికమళ్ళ శేఖర్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఎస్సీ రిజర్వేషన్ లలో మాదిగ లకు గత 50 ఏళ్ళ నుండి అన్యాయం జరుగుతుందని ఈ అంశాన్ని 1965 లోనే బిఎన్ లోకూర్ కమిషన్ నివేదికలో పేర్కొన్నారని తెలిపారు. తర్వాత రాష్ట్ర స్థాయిలో వేసిన జస్టిస్ రామచంద్రరావు, జాతీయ స్థాయిలో వేసిన ఉషా మెహ్రా కమీషన్లు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాయి. మంద కృష్ణమాదిగ 30 ఏళ్ళుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఎత్తిన జెండా దించకుండా వర్గీకరణను సాధించారని గుర్తుచేశారు. నేడు వర్గీకరణ ఫలాలు అందుకునే సమయం వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు అన్ని ఉద్యోగ నియామకాలు నిలిపివేసి చట్టం చేసిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేస్తే మాదిగ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షలో డాక్టర్ మోదుగు శ్యామ్ బాబు, డాక్టర్ నూకపొంగు రవిబాబు, డాక్టర్ పేరెల్లి కోటి, డాక్టర్ అద్దంకి తిలక్, పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతికి ధన్ ఖడ్‌కు
# ఎంపీ రవిచంద్ర పరామర్శ



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**
ఇటీవలే అనారోగ్యానికి గురై విశ్రాంతి తర్వాత కోలుకుని పార్లమెంట్ కు హాజరైన ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ ను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సహచర ఎంపీలతో కలిసి సోమవారం పరామర్శించారు. పార్లమెంట్ ఆవరణలోని రాజ్యసభ చైర్మన్ ఛాంబర్లో ఈ మేరకు ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. ప్రజలు, దేవుని ఆశీస్సులతో సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవడం పట్ల ఎంపీ రవిచంద్ర ఆనందం వ్యక్తం చేశారు. మరింత కాలం ప్రజా సేవకు అంకితం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతిని కలిసి పరామర్శించిన వారిలో తెలంగాణకు చెందిన భాజపా ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ కూడా ఉన్నారు.

## ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామిని
# దర్శించుకున్న ఎమ్మెల్యే



**హసన్‌పర్తి,తెలంగాణ ముచ్చట్లు :**
ఎర్రగట్టు గుట్ట శ్రీ స్వయంభు వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దర్శించుకొని ప్రత్యేక నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆలయాంల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశిస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అరెల్లి వెంకటస్వామి,డైరెక్టర్లు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మానీ శేకర్ రావు, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, హాసన్‌పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి,గడ్డం శివరాం ప్రసాద్, మార్క రాజు, చిర్ర రాము, వీసం సురేందర్ రెడ్డి, సంతోష్, గడ్డం అరుణ్, వరుణ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# డైలీ వైజ్ వర్కర్ల వేతనాలు తగ్గింపు

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్లో పనిచేస్తున్న డైలీ వైజ్ కార్మికుల వేతనాలు తగ్గిపోయాయన్న కారణంగా వారు సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలిక పోగు సర్వేశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం తోపాటు, కొత్తగా అమలు చేస్తున్న జీవో 64 కారణంగా డైలీ వైజ్ కార్మికులు నెలకు 4,000 రూపాయల మేర నష్టపోతున్నారని తెలిపారు. గతంలో వీరికి 16,000 రూపాయలు వేతనం వచ్చేది, కానీ జీవో 64 అమలు తర్వాత ఈ మొత్తం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేసి, పాత విధానం లోనే వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో కార్మికులు సమ్మెకు దిగారు. ప్రభుత్వం సంబంధిత శాఖ ద్వారా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ కార్మికులు సుశీల, పద్మ, సత్యనారాయణ, పాల్గొన్నారు.

# కన్నెగంటి 'భుజం మీద భూమి' పుస్తకావిష్కరణ





**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ప్రముఖకవి, వాగ్గేయకారుడు, కన్నెగంటి వెంకటయ్య కలం నుండి జాలు వారిని కవితా సంపుటి "భుజం మీద భూమి" పుస్తకాన్ని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మ ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. న్యూవిజన్ కాలేజ్‌లో జాషువా సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు ముvvా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ... కన్నెగంటి "భుజం మీద భూమి" పుస్తకంలోని అంశా లు, హృదయంలో దాగి ఉన్న భావాన్ని, సాహిత్యాన్ని చాలా చక్కగా అర్థవంతంగా సభికులకు అర్థమయ్యే విధంగా వివరించారు. కవిలో దాగి ఉన్న దళిత సాహిత్యాన్ని, వామపక్ష భావజాలాన్ని, సాహిత్య స్వరూపాన్ని, కళ్లకు కట్టే విధంగా ఆధ్యాంతం సభికులకు ఆనందింపజేసే విధంగా పాటల ద్వారా మాటల ద్వారా రంజింపజేశారు. కవి ఐనాల సైదులు "భుజం మీద భూమి" పుస్తకాన్ని సూక్ష్మంగా కవిలో దాగి ఉన్న సాహిత్యాన్ని నేటితరం యువతీ యువకులకు సాహిత్య ప్రేమికులకు అర్థం పట్టే విధంగా చాలా చక్కగా వివరించారు. ఈ పుస్తకాన్ని కన్నెగంటి వెంకటయ్య జన్మస్థలం అయినా లాలాపురం ప్రముఖ సిపిఎం జిల్లా నాయకులు సంక్రాంతి మధుసూదన్ రావుకి అంకితమిచ్చారు. ఈ పుస్తకాన్ని వారి కుమారుడు సంక్రాంతి రవికుమార్‌కు అందజేశారు. సభాధ్యక్షులు మువ్వ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఇప్పటివరకు గాయకుడిగా, గేయ రచయితగా, కవిగా ఉన్న కన్నెగంటి నేటి నుండి బుక్కు రూపంలో బుక్ అయిపోయాడని చమత్కరించారు. కవి కన్నెగంటి వెంకటయ్య మాట్లాడుతూ... తాను చదువుకునే రోజులలో ప్రధానంగా బువ్వ కోసం స్కూల్‌కి వెళ్లానన్నారు. ఇక్కడ నుండి నా ప్రయాణం ఉస్మానియా యూనివర్సిటీ వరకు వెళ్లి నేడు అప్పల నరసింహాపురం జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్నానంటే దానికి కారణం నా తల్లిదండ్రులేనన్నారు. నా చదువు విషయంలో ఎన్నో త్యాగాలు చేసారని, అందులో నా తమ్ముడు శ్రీను సగభాగమై అటు కుటుంబానికి ఇటు నాకు కొండంత అండై నా ఎదుగుదలకు వారు తోడ్పాటు అందించారన్నారు. తన అర్ధాంగి అరుణ కుమారి అటు కుటుంబాన్ని, పిల్లల్ని, నన్ను నా సాహిత్యంలో సగభాగమైందన్నారు. తాను చదువుకునే సమయంలో ఊరిలో అదేవిధంగా సమాజంలో ఉన్న కులవివక్ష నన్ను కృంగదీసిందన్నారు. అయినప్పటికీ చదివే అన్నిటికీ పరిష్కారం మార్గంగా భావించి నా స్నేహితులు (లాలా పురం) సహకారంతోనే ముందడుగు వేస్తూ... ఆ మార్గంలో ఆ రోజుల్లో సమాజా న్ని పట్టిపీడిస్తున్న సారా వలన అనేకమంది జీవితాలు నా కళ్ళముందే కనుమరిగాయి. ఆ సందర్భంలో నేను రాసిన "ఆక్కో సారా యి చుక్క" పాటతో నేను ఈ ప్రపంచానికి పరిచయం అవ్వడం జరిగిందన్నారు. అక్కడ నుండి నా ప్రయాణం సినారె రాసిన గజల్స్ ద్వారా నేను పనిచేసిన అశ్వరావుపేట, ముదిగొండ చెరువు మాదారం జిల్లా పరిషత్ హై స్కూల్ లలో సాహిత్యం మీద ప్రేమతో పిల్లలచే అనేక రచనలు వారిచేత రాయించనన్నారు. వారు జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో అనేక బహుమతులు పొందారని వారిని సాహిత్యంలో నాకంటే ఎక్కువగా తయారు చేయడంలో తాను కృతనిశ్చ యుడై నానని అన్నారు. నన్ను సన్మార్గంలో నడిపించిన సంక్రాంతి మధుసూదన్ రావుకి అంకితం ఇవ్వడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి తెలంగాణ, గవర్నమెంట్ హెడ్మాస్టర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వీరస్వామి, లాలాపురం సిపిఎం పార్టీ నాయకులు చింతనిప్పు చలపతిరావు, యు టిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్, ఖమ్మం జిల్లా తెలుగు సాహిత్య తెలుగు రచయితలు కొమ్మవరపు, గద్దపాటి శ్రీనివాసరావు, శేషగిరి పోతగాని, దేవయ్య, సునంద, అరుణ కుమారి, కొండ్రు బ్రహ్మం, సంక్రాంతి చంద్రశేఖర్, రవికుమార్ ఉత్తంకు మార్, రమేష్, మాజీ సర్పంచి చంద్రశేఖర్, చింతనిప్పు కృష్ణారావు, రామారావు, జానీ, పాషా, దామోదర్, వెంకయ్య పాల్గొన్నారు.



## జాతీయ క్రీడలకు ఎంపికైన క్రీడాకారుడికి
# జిల్లా ఎస్పీ ప్రోత్సాహం

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**
వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండలం మల్కినంపల్లి గ్రామం దేవరబండ తాండకు చెందిన జరుపుల అశోక్ వాలీబాల్ క్రీడలో గత నెలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. జరుపుల అశోక్ వాలీబాల్ క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎన్నికై ఆర్థిక ఇబ్బందుల కారణంగా పోటీలకు దూరంగా ఉన్నాడు. విషయం తెలుసుకున్న వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐ.పి.యస్ సహృదయంతో తనవంతుగా (15,000) వేల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందించి క్రీడా పోటీలకు సిద్ధం కావాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అంగవైకల్యం ఉన్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో ప్రతిభను కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికవ్వడం అభినదనియమని అన్నారు. జాతీయ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచి మన జిల్లా కీర్తిని దశదిశలా చాటాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ క్రీడాకారుని ప్రేరణగా తీసుకొని విద్యార్థులు,యువత తాము ఎంచుకున్న క్రీడలలో ముందుకు కొనసాగాలని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సీఐ, కృష్ణ, రిజర్వు ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు, కార్యాలయ పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి
# పేరు పెట్టడం హర్షణీయం

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**



తెలుగు యూనివర్సిటీకి గొప్ప సాహితీవేత్త, వనపర్తి నియోజకవర్గం తొలి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టడం హర్షణీయం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నా రెడ్డి అన్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనే గొప్ప గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురష్కారం ప్రధానం చేసిందని చిన్నారెడ్డి గుర్తు చేశారు. గోల్కొండ పత్రిక ద్వారా ప్రజలను జాగృత పర్చిన గొప్ప సంపాదకులు సురవరం ప్రతాప్ రెడ్డి అని చిన్నారెడ్డి కొనియాడారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టాలన్న వనపర్తి నియోజకవర్గం ప్రజల చిరకాల కోరిక అసెంబ్లీ తీర్మాణంతో నెరవేరిందని చిన్నారెడ్డి అన్నారు. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, రాష్ట్ర కేబినెట్ కు, అసెంబ్లీ సభ్యులకు చిన్నారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## రాముడి పేరుతో రాజకీయం చేస్తారు..
# కానీ రామ క్షేత్రాన్ని పట్టించుకోరు..!



**- రాజ్యసభలో రైల్వే సమస్యలపై ధ్వజమెత్తిన ఎంపీ రవిచంద్ర**

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**
రాముడి పేరుతో రాజకీయం చేసే ఎన్డీఏ ప్రభుత్వం.. అదే రాముడు నడయాడిన భద్రాచల క్షేత్రంతో పాటు, తెలంగాణలోని రైల్వే సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. సోమవారం రాజ్యసభలో బడ్జెట్లో రైల్వే శాఖ కు కేటాయించిన నిధులపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన తెలంగాణ కు సంబంధించిన పలు రైల్వే సమస్యలను ప్రస్తావించారు. 'రఘుపతి రాఘవ రాజారామ్' అనే రాముడి కావ్యంతో చర్చను ప్రారంభించిన ఆయన దక్షిణ అయోధ్య గా పిలవబడే భద్రాచలం క్షేత్రానికి రైలు మార్గం అనుసంధానించే భద్రాచలం – కొవ్వూరు రైల్వే లైన్ దశాబ్దాల నుంచి కలగా ఉంటోందని, ఈ కల సాకారం కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని చెప్పారు. భద్రాచల క్షేత్రం ప్రాశస్త్యాన్ని గుర్తించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, జిల్లాల పునర్విభజణలో కొత్తగూడెం జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా నామకరణం చేసి రాముడి పై తనకున్న అపార భక్తిని చాటుకున్నారని గుర్తు చేశారు. రైల్వే ఆదాయానికి అధిక శాతం నిధులు సమకూరుస్తున్నా.. తెలంగాణ లో పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల కు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదని వాపోయారు. ఉత్తర, దక్షిణ భారత దేశానికి ప్రవేశ ద్వారంగా ఉన్న ఖాజీపేటను రైల్వే డివిజన్ గా గుర్తించాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు 48 శాతం ఆదాయం సమకూరుస్తున్న ఖాజీపేటను ప్రత్యేక డివిజన్ గా గుర్తిస్తే.. లాభదాయకంగా ఉంటుందని రవిచంద్ర ప్రస్తావించారు. సిద్దిపేట జిల్లాలో చిన్న కోడూరు రైల్వే స్టేషన్ మంజూరు, నిజామాబాద్, మంచిర్యాల, భద్రాచలం రోడ్ నుంచి తిరుపతికి నూతన రైలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ లో రైల్వే మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణంలో ఉన్న రైల్ ఓవర్ బ్రిడ్జి పనుల వేగవంతం, కొత్త బ్రిడ్జిల మంజూరు, రైల్వే స్టేషన్లలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాల కల్పనపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని రవిచంద్ర కోరారు.



## సత్తుపల్లి సింగరేణి కాలనీలో
# సూపర్ బజార్ ఏర్పాటు చేయాలి

**సత్తుపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**
సింగరేణి కార్మికుల సౌకర్యార్థం సత్తుపల్లి పివిఎన్ కాలనీలో సింగరేణి సూపర్ బజార్ ప్రారంభించాలని ఐఎన్‌టియుసి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ నేతృత్వంలోని కార్మిక సంఘం నాయకులు కోరారు. కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు, ఐఎన్‌టియుసి బృందం స్థానిక ఉద్యోగులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకుంది. గతంలో సింగరేణి యాజమాన్యం సుమారు మూడు సంవత్సరాల క్రితం కార్మిక కుటుంబాల కోసం సింగరేణి క్వార్టర్స్ నిర్మించినప్పటికీ, ఇప్పటి వరకు అక్కడ సూపర్ బజార్ ఏర్పాటు చేయకపోవడం వల్ల కార్మికులు నిత్యావసర సరుకుల కోసం ఇతర ప్రాంతా లకు వెళ్లాల్సి వస్తోందని కార్మికులు వాపోయారు. సింగరేణి సంస్థలో సుమారు 4,500 మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి సౌకర్యార్థం సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి సత్తుపల్లి పి.వి.ఎన్ కాలనీలో సూపర్ బజార్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జీఎం చెన్నకేశవ రావు, ఫిట్ సెక్రెటరీలు జెవిఆర్ ఓసి రామారావు, కిష్టారం ఓసి బాలాజీ, జెవిఆర్ సిహెచ్‌పి నాగేశ్వర రావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీలు కోటి, ఐవీ రెడ్డి, సురేష్, నాయకులు రషీద్, తిరుమల రావు, రమేష్, సుందర్, రవిబాబు, మున్వర్ ఖాన్, మాటేటి రమేష్, అన్వర్ జానీ, నరేందర్, పొట్టి కిరణ్, కొమురయ్య, నాగేం దర్, మోసిన్, చెరుకు రాజు, సుదర్శన్, దాసరి శ్రీనివాస్, శ్రీధర్, సుధాకర్, రాజేందర్, లింగమూర్తి పాల్గొన్నారు.

## కౌన్సిల్ ఆవరణలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీల
# వినూత్న నిరసన


**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సోమవారం మండలి ఆవరణలో మిర్చి దండలు వేసుకొని నిరసన తెలిపారు. మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని 25వేల గిట్టుబాటు ధర కల్పిం చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ లు. తెలంగాణ రాష్ట్రంలో గత సీజన్లో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు అయింది.. ధర లేక ఈ సీజన్లో 2లక్షల 40 వేల ఎకరాల విస్తీర్ణం తగ్గిపోతోంది అని ఆందోళన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి నాఫెడ్, మార్క్ ఫెడ్ ద్వారా మిర్చి మద్దతు ధర క్వింటాల్‌కు ఇరవై ఐదు వేల రూపాయలు ధర నిర్ణయించి ప్రభుత్వం కొనుగోలు చేయాలి. తెలంగాణ మిర్చి పంటలు విదేశీ ఎగుమతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తెలంగాణ మిర్చి పంటను సుగంధ ద్రవ్యాల బోర్డు నుంచి ఆహార పంటల జాబితాలో చేర్చాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేసారు.

# పోగొట్టుకున్న 48 మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగింత

**- ఈ ఏడాదిలో 290 మొబైల్ ఫోన్లను రికవరీ**
**- వివరాలు వెల్లడించిన అడిషనల్ డీసీపీ ఆడ్మిన్**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



పోగొట్టుకున్న 48 మొబైల్ ఫోన్లను (సిఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి బాధితులకు అప్పగించినట్లు అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ నరేష్ కుమార్ తెలిపారు. బాధితులు పోగొట్టు కున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్ ను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో మొబైల్ ఫోన్ ట్రాక్ చేసిన ఐటి సెల్ బృందం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచనలతో పోలీస్ కమిషనర్ కార్యాలయంలో యజ మానులకు అడిషనల్ డీసీపీ చేతుల మీదుగా అప్పగిం చారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ... సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ విధానంతో సుమారు 7 లక్షల విలువ గల 48 ఫోన్లను ట్రేస్ చేసి, నిజమైన యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. ఒక్కొక్క మొబైల్ ఫోన్ లక్ష యాభై వేల నుండి 10 వేల రూపాయలు ఖరీదు గల ఫోన్లను ట్రాక్ చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 680 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు సిఈఐఆర్ పోర్టల్ ఫిర్యాదులు నమోదు కాగా 582 ఫోన్ల ట్రాక్ ను గుర్తించి 290 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత జీవన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్న....నగదు లావాదేవీలు చేయాలన్న మొబైల్ ఫోన్ పైనే ఆదారపడేంతగా ప్రాదాన్యం సంతరించుకుందని అన్నారు. మొబైల్ ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న /చోరికి గురైతే పరిస్తితి ఎలా ఉంటుందో ఊహించనవసరం కష్టమేనని అన్నారు. పోయిన ఫోన్‌లను వెతికి పెట్టడానికి పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగి స్తుందన్నారు. సెల్ ఫోన్ల రికవరీలో కీలకంగా వ్యవహరించిన ఐటి సెల్ నోడల్ ఆఫీసర్ ఏసీపీ వెంకటేశ్, ఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ హెమనాథ్, కానిస్టేబుల్ నరేష్, కానిస్టేబుల్ శ్రీనును పోలీస్ కమిషనర్ అభినందించారు.

# ఘరానా మోసగాడిపై బాధితుల ఆవేదన

**తల్లాడ,తెలంగాణ ముచ్చట్లు:**




లోన్ మోసం, అక్రమ ఆస్తి స్వాధీనం ఆరోపణలతో ఖమ్మం జిల్లాకు చెందిన మంగతాయి అనే మహిళ గుంజి గురవయ్య, చోళా బ్యాంక్ ఏజెంట్‌లపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె మీడియా సమావేశంలో తన ఆవేదన వెలిబుచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం, 2020లో గుంజి గురవయ్య, చోళా బ్యాంక్ ఏజెంట్ కలిసి తన ఇంటిని సీజ్ చేయించేందుకు కుట్రపన్ని, నకిలీ పత్రాలు సృష్టించి 20 లక్షల రూపాయలు లోన్ తీసుకున్నట్లుగా అబద్ధపు రికార్డులు రూపొందించారని ఆరోపించింది. ఆమె ఖాతాలోకి ఆ మొత్తం జమ చేసినట్టు చూపించి, ఫ్రోర్జరీ సంతకాలతో మొత్తం డబ్బును వేరే వ్యక్తులు విత్‌డ్రా చేశారని తెలిపింది. ఇందిరమ్మ గృహ పథకం కింద 2008లో మంజూరైన ఇంటిని అక్రమంగా విక్రయించినట్లు గురవయ్య, అతని భార్య రమాదేవి నకిలీ ఒప్పందాలు తయారు చేసుకున్నారని మంగతాయి ఆరోపించారు. ఈ వ్యవహారంపై 2024 జనవరి 22న గురవయ్యపై 354, 420, 506 సెక్షన్ల కింద కేసులు నమోదైనా, స్టేషన్ బెయిల్ తీసుకుని బయటపడ్డాడని ఆమె తెలిపారు. అయితే, తన ఖాతా నుంచి డబ్బు దోచుకున్న వారి మీద ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల మార్చి 22న రాత్రి 9 గంటల సమయంలో గురవయ్య తనపై హత్యాయత్నం చేసినట్లు మంగతాయి వెల్లడించారు. వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించి కేసు పెట్టించినా, ఇప్పటికీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. తక్షణమే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తన డబ్బు తిరిగి ఇప్పించాలని, తన ఇంటిని వేలం వేయ కుండా ఆపాలని మంగతాయి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బాధితురాలి కుటుంబ సభ్యులు సీత మ్మ, నాగేంద్రబాబు, రంగారావు పాల్గొన్నారు.

# సింగపురం ఇందిరకు సముచిత గౌరవం ఇవ్వాలి

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు:**
కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో అహర్నిశలు శ్రమించిన నేతలకు తగిన గౌరవం ఇవ్వకపోతే, పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని స్టేషన్ ఘనపూర్ ఎంపిటిసిల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు సింగపురం దయాకర్ హెచ్చరించారు. పార్టీని అద్భుతంగా బలోపే తం చేసిన సింగపురం ఇందిరకు ప్రభుత్వం తగిన స్థానం కల్పించాలని, లేకుంటే అసలైన కాంగ్రెస్ కార్యకర్తలంతా కలిసి గాంధీ భవన్ ముట్టడి చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.



**ఇందిరకు జరిగిన అన్యాయం తక్షణమే సరిచేయాలి**

తాజాగా స్టేషన్ ఘనపూర్‌లో జరిగిన సీఎం బహిరంగ సభలో నియోజకవర్గ ఇంచార్జ్ అయిన సింగపురం ఇందిరను పిలవకపోవడం తగదని, ఇది పార్టీ కార్యకర్తలకు తీవ్ర అసంతృప్తి కలిగించే పరిణామమని దయాకర్ పేర్కొన్నారు. పార్టీకి అంకితంగా పనిచేసిన నేతలను అవమానించడం ఎంతవరకు సమంజసం? అని ఆయన ప్రశ్నించారు. ‘2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి పార్టీ బలం పెంచిన ఇందిరకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరం. ఆమె పార్టీకి చేసిన సేవలను విస్మరిస్తూ, కొత్తగా వచ్చిన నేతలకు ప్రాధాన్యత ఇవ్వడం కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి రేపుతోంది” అని దయాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

**కడియం శ్రీహరి కుట్రలకు తాము మోసపోం**

సింగపురం ఇందిరను పక్కన పెట్టడం వెనుక బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి కుట్రే ఉందని, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని తన కుటుంబ రాజకీయ భవిష్యత్తు కోసం సిద్ధం చేసుకోవడమే ఆయన లక్ష్యమని దయాకర్ విమర్శించారు.‘కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్య రాజకీయ భవిష్యత్తును భద్రపరచుకునేందుకు, అందుకోసం నిజమైన కాంగ్రెస్ నాయకులను పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ లోయల్ క్యాడర్‌ను అవమానించినట్లే. అసలు కార్యకర్తలు ఇలాంటి కుట్రలను సహించబోరు” అని ఆయన అన్నారు.

**త్వరలో మీనాక్షి నటరాజన్‌ను కలిసి న్యాయం కోరతాం**

సింగపురం ఇందిరకు సముచిత స్థానం కల్పించేలా తాము త్వరలోనే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసి వివరణ కోరుతామని, కాంగ్రెస్ కార్యకర్తల తరపున ఇందిరకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తామని దయాకర్ స్పష్టం చేశారు. ‘పార్టీకి అంకితభావంతో పనిచేసిన నేతలకు అన్యాయం జరిగితే, కాంగ్రెస్ నిజమైన శ్రేణులు ఊరుకునే పరిస్థితి లేదు. అవసరమైతే గాంధీ భవన్ ముట్టడికి కూడా సిద్ధమే. తక్షణమే సింగపురం ఇందిరకు గౌరవప్రదమైన స్థానం కల్పించాలి. కాంగ్రెస్‌లో ఆత్మీయత, నిబద్ధత గల నాయకులకు అన్యాయం జరిగితే, అది పార్టీ బలోపేతానికి ఇంతకంటే పెద్ద అవరోధం ఉండదు” అని దయాకర్ హెచ్చరించారు.

## పొట్టి శ్రీరాములు గురించి మాట్లాడే నైతిక హక్కు
# బీజేపీ,బీఆర్ఎస్‌లకు లేదు

**వర్ధన్నపేట, తెలంగాణ ముచ్చట్లు :**
పొట్టి శ్రీరాములు గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలకు లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన పొట్టి శ్రీరాములు చర్చ పై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడారు. పొట్టి శ్రీరాములు చర్చ మీద మా అందరికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు చాలా గౌరవం ఉందని ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డ కొత్త లోనే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని తొలగిం చారని అన్నారు.అంతేకాక ఇండియన్ పీనల్ కోర్టును భారతీయ న్యాయ సంస్థ అని ముందుకు తీసుకొచ్చిన దుర్భర ఘనత బీజేపీ పార్టీది అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరిని అగౌరవ పరిచే విధంగా ఏనాడు ప్రవర్తించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీని పాకిస్తాన్ టీం అని బీజేపీ పార్టీ ఇండియా టీం అని మాట్లాడుతున్నారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీల తీరును ప్రజలందరూ గమనిస్తు న్నా రన్నారని తెలిపారు.ముస్లింలు అంటే గౌరవం లేకుండా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మాట్లాడు తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి ప్రజలకు ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు వెళుతుందని తెలిపారు.పార్లమెంట్‌లో మొన్న అంబేద్కర్‌ను అవమానిస్తూ నేడు అసెంబ్లీ లో దళిత స్పీకర్ ను అవమానిస్తే దానిపైన ఎవరు స్పందించలేదు అన్నారు.పొట్టి శ్రీరాములు అంటే బీజేపీ, బిఆర్ఎస్ పార్టీల కంటే కాంగ్రెస్ ప్రభుత్వా నికే చాలా ఎక్కువ ప్రేమ ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని కులాలను, మతాలను బేధాభిప్రాయాలు లేకుండా ఒక మంచి ధోరణితో ముందుకు సాగుతుంటే బీజేపీ,బిఆర్ఎస్ పార్టీలు ఓర్వలేక మా కాంగ్రెస్ పార్టీ నాయకుల మీదపై బురద జలుతున్నారన్నారు.

# యువత సాధికారత కోసం ప్రభుత్వం కృషి

**వర్ధన్నపేట,తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం ఒక్కొక్కరికి 3లక్షలు అంది ంచనున్నదని, ఇది యువత సాధికారత కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దార్శనికత అని కాంగ్రెస్ ఎస్సీ విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షులు తూల్ల రవి అన్నారు. సోమవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షులు తూల్ల రవి మాట్లాడుతూ మార్చి 2025 నిరుద్యోగాన్ని పరిష్కరించడానికి ఒక మైలురాయి చర్యలో భాగం గా, తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం 2025ను ఆవిష్కరించిందని దీని ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 5లక్షల మంది నిరుద్యోగ యువతకు 3లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు.స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ పథకం తెలంగాణ సమ్మిళిత వృద్ధికి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు.

## రంగారెడ్డి జిల్లా రైతుల
# త్యాగమే పరిశ్రమలు రాక

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**
మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకారంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ శాఖా మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాపీపై బీఆర్ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి. మార్కెట్ కమిటీలో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చాం. రైతులకు ఒకేదఫాలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తే కళ్లులేని కబోదిల్లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం ఆధారిత కొత్త పరిశ్రమలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి చెప్పారు. కొత్త పరిశ్రమలకు రంగారెడ్డి జిల్లా అన్నదాతల భూముల త్యాగమే ఇక్కడి అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.... వ్యవసాయ మార్కెట్ కమిటీలో అన్ని వర్గాలకు, కులాలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని కేఎల్ఆర్ చెప్పారు. రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగమే నేటి యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు అన్నారు. కొత్తకమిటీ కర్షకలోకానికి మంచి చేయాలని, అవగాహన పెంచాలని రైతుబిడ్డ లక్ష్మారెడ్డి చెప్పారు.అంతకు ముందు తుక్కుగూడలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌కు ఘన స్వాగతం లభించింది. మహేశ్వరం పట్టణంలో స్వాగతతోరణం, కాంగ్రెస్ జెండాలు, వాహనశ్రేణితో భారీ స్వాగతం పలికారు.

# సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

**మంథని, తెలంగాణ ముచ్చట్లు :**
సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. సంకష్ట చతుర్థి నాడు వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విగ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండాచుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయం లోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

# కడియం శ్రీహరి అవకాశవాది: బీఆర్ఎస్



**హన్మకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. సభకు ఎన్నికల కోసం రాలేదంటూనే... వారి చేష్టలు అన్నీ ఎన్నికల్లో లబ్ధి కోసమే... అయితే ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కడియం శ్రీహరి చేస్తున్నారు. నాడు స్వరాష్ట్ర ఉద్యమ సమయంలో నాటి ముఖ్యమంత్రులు వైఎస్సార్, కిరణ్ కుమార్ రెడ్డి వస్తే మాపై ఎటువంటి నిర్బంధాలు కొనసాగేవో భయంకరమైన వాతావరణంలో ఘన్‌పూర్ నియోజకవర్గం అంతా అక్రమ అరెస్ట్‌లే అయ్యాయన్నారు. సైకో లాగా , చిల్లర మాటలు, చిత్తశుద్ధిలేని మాటలు రేవంత్ రెడ్డి మాట్లాడారు వంద ఎలుకలన్ని తిన్న పిల్లిలాగా కడియం నిన్నటి సభలో ఏమీ తెలియనట్టు నిల్చున్నాడు... వారి తీరు స్టూడెంట్ ముందు లెక్చరర్ నిల్చున్నట్టు ఉంది... పైగా కడియం శ్రీహరి విలువల గురించి మాట్లాడుతారు. బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశాడన్నారు. ఇంట్లో మూలకు కూర్చున్న ఆయనను తీసుకొచ్చి... పార్టీలో చేర్చుకుని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉప ముఖ్యమంత్రిని చేసింది కేసీఆర్ అన్నారు. ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి... తాటికొండ రాజయ్య మాట్లాడుతూ... నిన్న ఆగమేఘాల మీద, ఎవరో తరమితే ఉరికొచ్చినట్లు రేవంత్ రెడ్డి సభ కళావిహీనంగా , నిర్బంధాల మధ్య సాగిందన్నారు. కేవలం అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్న వ్యక్తి రేవంత్ రెడ్డి, ఆ అప్పుల్లో కొంత కేవలం ఢిల్లీకి కప్పం కడుతున్నారని ఆరోపించారు.శ్రీహరికి జీవిగంజి పోసి అన్ని పదవులు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపానన్నారు. నీతి గురించి మాట్లాడే కడియం శ్రీహరి అవినీతి చక్రవర్తి అన్నారు.పచ్చి అవకాశవాది కడియం శ్రీహరి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై అసభ్యకరమైన మాటలు మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ సాధకుడు, 10 ఏండ్లు ముఖ్యమంత్రిగా చేశారు, తెలంగాణకు అభివృద్ధి ప్రదాత, అటువంటి వ్యక్తిపై మార్చురీ అంటూ మాట్లాడిన రేవంత్ రెడ్డికి రానున్న రోజుల్లో మార్చురీ తప్పదన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను
# త్వరగా పరిష్కరించాలి



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**
ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి డిఆర్ఓ విజయలక్ష్మిలతో కలసి జిల్లావ్యాప్తంగా ప్రజల నుండి పలు సమస్యలపై మొత్తం 94 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 20, పోలీసు శాఖ 11, వైద్య ఆరోగ్య శాఖ 7, పౌర సరఫరాల శాఖ 7, కలెక్టరేట్ 6, జిడబ్ల్యూఎంసి -6, విద్యశాఖ - 4 ధరఖాస్తులు, వివిధ శాఖలకు సంబంధించిన పలు సమస్యల పై దరఖాస్తులు స్వీకరించా రు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించలేని దరఖాస్తులను ఆయా దరకాస్తుదారునికి స్పష్టంగా తెలియ పరచాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సీఎం ప్రజావాణిలో స్వీకరించి సంబంధిత శాఖల వారీగా పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మండల ప్రత్యేక అధికారులతో వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపడుతున్న చర్యలు, విద్యుత్ సరఫరా, రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందుల ఏర్పా టు తదితర అంశాలపై మండలాల వారీగా కులంకషంగా సమీక్షించి సమర్థవం తంగా నిర్వహించుటకు అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఆర్డీఓ కౌసల్య దేవి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులతో జైల్లో వేయడమే
# ఇందిరమ్మ రాజ్యమా?

మొదటిపేజీ తరువాయి

జర్నలిస్టులపై రేవంత్ రెడ్డి అక్కసు వెళ్ళగక్కుతున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నాడు..6 గ్యారంటీలతోపాటు ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యమని పెద్ద పెద్ద మాటలు చెప్పిన రేవంత్ రెడ్డి, ప్రజలు గొంతు విప్పితే మాత్రం తట్టుకోలేకపోతున్నాడు. తన భార్యా పిల్లలను దూషిస్తున్నారని బాధపడుతున్న రేవంత్ రెడ్డి గతంలో మా మీద అవాకులు చెవాకులు మాట్లాడిన సంగతి మర్చిపోయారా? మా పిల్లల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు రేవంత్‌కు కుటుంబం గుర్తుకు రాలేదా? నువ్వు మాట్లాడితే మంచిది ఇంకొకరుమాట్లాడితే మంచిది కాదా..? రేవంత్ రెడ్డి ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలి. సిగ్గు తెచ్చుకోవాలి అని కేటీఆర్ సూచించారు.

## అసెంబ్లీలో బీసీ
# రిజర్వేషన్ బిల్లు..!

మొదటిపేజీ తరువాయి

రాహుల్ గాంధీ చెప్పినట్లే.. తెలంగాణలో కులగణన చేశామన్నారు. గతేడాది ఫిబ్రవరి 4న కేబినెట్‌లో తీర్మానం చేశామని చెప్పారు. తొలి దఫా సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశమిచ్చామన్నారు. 3.55 కోట్ల మందికిపైగా సంపూర్ణ వివరాలు అందించారన్నారు. ఈ సర్వేలో 75 వేలమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి వస్తే.. కులగణన సర్వే నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. ఇక 2023 ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో పార్టీ కొలువు తీరింది. ఈ నేపథ్యంలో 2025 ఏడాది ప్రారంభంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టింది. అయితే ఈ సర్వేలో బీసీల శాతం తగ్గిందం టూ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ ఆరోపిం చింది. అంతేకాకుండా ఈ సర్వే అంతా తప్పుల తడకగా అభివర్ణించింది. ఇక ఈ విమర్శలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం బలంగా తొసిపుచ్చింది. అలాగే కులగణనలో పాల్గొనని వారి కోసం మరో అవకాశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వంకల్పించిన సంగతి రాష్ట్ర ప్రజలకు తెలిసిందే..

## కరీంనగర్‌కు నీటి
# సమస్య ముప్పు..?

మొదటిపేజీ తరువాయి

మంచినీటి ముప్పును గమనించి అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయింది. మేడిగడ్డ బ్యారేజ్‌కి పగుళ్లు రావటంతో? కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది మరమ్మత్తు పనులు ముందుకు సాగక కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్, అన్నారం సరస్వతి బ్యారేజ్, సుందిళ్ళ వద్ద పార్వతి బ్యారేజీలు నీళ్లు నిలువ చేయకుండా మొత్తం ఖాళీ చేసి గోదావరిని ఏడారిగా మార్చారు.

## ఇప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు
# నీళ్లు వచ్చే పరిస్థితి లేదు..



**- ఎంపీ రవిచంద్ర వినతికి సానుకూల స్పందన**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**
ఖమ్మం నగరంలోని రైల్వే మధ్య గేటు సమస్యకు శాశ్వత పరిష్కారానికి హామీ లభించింది. ఈ మేరకు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం పార్లమెంటులో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కలిసారు. మధ్య గేటు ప్రాధాన్యత, వ్యాపార, వాణిజ్య సంబంధాలు, రెండు పట్టణ ప్రాంతాల కలయిక తదితర అంశాలపై ఆయన రైల్వే మంత్రికి సోదాహరణంగా వివరించారు. ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి కి సానుకూలంగా స్పందించిన మంత్రి మధ్య గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణంపై సాధ్యాసాధ్యలను పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులకు సూచించారు. ఖమ్మం మధ్య గేటు సమస్యపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు రైల్వే శాఖ పై రాజ్యసభలో జరిగిన చర్చలో ఎంపీ రవిచంద్ర మధ్య గేటు సమస్యను ప్రముఖంగా ప్రస్తావించారు. కమాన్ బజార్, గాంధీ చౌక్ ప్రాంతాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలకు ప్రధాన మార్గమైన ఈ గేటు గడిచిన నాలుగు నెలలుగా మూసి ఉంచడం వల్ల వ్యాపార లావాదేవీలు స్థంబించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో ప్లాట్ ఫాం విస్తరణ పనులు వేగం పెంచి. తక్షణమే మధ్య గేటును వినియోగంలోకి తేవాలని కోరారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అక్కడ ఆర్వోబీ లేదా అండర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ఎంపీ రవిచంద్ర పార్లమెంట్ లో రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# నిర్లక్ష్యంగా సర్జరీ చేసిన వైద్యులను సస్పెండ్ చేయాలి

**సీకేఎం హాస్పిటల్‌లో పేదలకు అందిస్తున్న వైద్యం ఇదేనా?**

**వెన్నెల కుటుంబానికి రూ. 5లక్షల పరిహారం ఇవ్వాలి**

**ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల**

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

సీకేఎం ఆసుపత్రికి కాన్పు కోసం వచ్చిన ఈర్ల వెన్నెల కు నిర్లక్ష్యంగా సర్జరీ చేసిన వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో సికెఎం ఆసుపత్రి ఎదుట భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ కు చెందిన ఈర్ల వెన్నెల అనే యువతీ ఈనెల 11న సీకేఎం ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చిందని అన్నారు. ఆసుపత్రిలో సర్జరీ చేసే క్రమంలో అక్కడి వైద్యులు ఆమె పొట్టలో ప్యాడ్ (ధూది) ఉంచి అలాగే కుట్లు వేసి ఇంటికి పంపించారని అన్నారు. ఈ క్రమంలో ఇంటికి వెళ్లిన వెన్నెల మలమూత్రాలు వెళ్లలేక సుమారు మూడు రోజులపాటు తీవ్ర ఇబ్బందులు పడి ప్రాణాపాయస్థితికి వెళ్లిందన్నారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమెను హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా అక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి ఆరు శాతం ఉండవలసిన ఇన్ఫెక్షన్ 66 శాతానికి పెరిగిందని చెప్పినట్లు తెలిపారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన వెన్నెలకు నిర్లక్ష్యంగా వైద్యం చేసిన సంబంధిత వైద్యులను వెంటనే సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి రూ. 5లక్షల పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. వెన్నెలకు అయ్యే వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ స్పందించి వెన్నెలకు నిర్లక్ష్యంగా సర్జరీ చేసిన వైద్యులను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గతంలో ఇదే హాస్పటల్‌లో ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన కరిష్మా అనే మహిళ కాన్పు కోసం వచ్చి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మరణించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇటీవల సికేఎం హాస్పిటల్‌లో మరో ఐదుగురికి ఇదేవిధంగా నిర్లక్ష్యంగా సర్జరీ చేసి గుట్ట చప్పుడు కాకుండా రెండవసారి సర్జరీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం కరీంనగర్ నలగొండ జిల్లాలకు నుండి మహిళలు ప్రసూతి, ఇతర వైద్యం కోసం సీకేఎం హాస్పిటల్ కి వస్తుంటారని అన్నారు. కానీ ఇక్కడ వైద్యులపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో హాస్పిటల్ కి వచ్చే పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సికేఎం హాస్పిటల్ ఆర్ఎంఓ, సూపర్డెంట్‌ల దృష్టికి సమస్య తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా వైద్యం చేసిన డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా వారిని వెనకేసుకు వస్తున్నారని ఇలాంటి వారి వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయ న్నారు. సీకేఎం ఆస్పత్రిపై స్థానిక ఎమ్మెల్యే మంత్రి కొండ సురేఖ దృష్టి సారించి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకునేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.అనంతరం సీకేయం హాస్పిటల్ ఆర్ఎంవో మురళి, సూపర్డెంట్ షర్మిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు టి భవాని, ఎండి బేగం జిల్లా సహాయ కార్యదర్శులు బి సంగీత, ఏ. వాణి జిల్లా కమిటీ సభ్యులు మైదం వినోద, ఎస్.కె హసీనా పెద్దలు, పాల్గొన్నారు.









## వరంగల్ నూతన సీపీ సన్ ప్రీత్ సింగ్‌కు బీజేపీ నేతలు శుభాకాంక్షలు

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు :**

వరంగల్ పోలీస్ కమీషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్ (ఐపీఎస్) ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.కాగా భారతీయ జనతా పార్టీ సీనియర్ జాతీయ నాయకులు,వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు తక్కెళ్ళపల్లి రాజేశ్వర్ రావు,వన్నాల శ్రీరాములు,బీజేపీ రాష్ట్ర నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, హన్మకొండ జిల్లా ప్రజా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గజెళ్ళి శ్రీరాములు లు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.శాంతి బద్రతల పరిరక్షణలో సన్ ప్రీత్ సింఘ్ రాణించాలని,సంఘ విద్రోహశక్తులకు కట్టడి చేయడంలో పోలీసింగ్ అమలు చేయాలని వారు ఆకాంక్షించారు.సన్ ప్రీత్ సింగ్ విధినిర్వహణలో విజయం సాధించడానికి పరిస్థితులు అనుకూలంగా సహకరించాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు,వన్నాల శ్రీరాములు తలిచారు.

## ఉస్మానియాలో ఉద్యమ నిషేధాలను ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం




**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు**

ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల ధర్నాలు, నిరసనలను నిషేధిస్తూ విసి తీసిన సర్కులర్ ను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ బిఆర్‌ఎస్వి ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ వద్ద నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బిఆర్‌ఎస్వి కేయూ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్ బిఆర్‌ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేసే హక్కు, భారత రాజ్యాంగం కలిపిస్తే ,రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీలో ఎలాంటి నిరసనలు చేపట్ట రాదని వాటిని నిషేధిస్తూ జీవో తీయడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమని వారన్నారు, రాహుల్ గాంధీ పార్లమెంట్లో భారత రాజ్యాంగాన్ని చూపిస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం దానికి భిన్నంగా తెలంగాణలో నిర్బంధ పాలన సాగిస్తున్నారని, ఉస్మానియా యూనివర్సిటీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, దాన్ని కాపాడవలసింది పోయి, విద్యార్థుల హక్కులను కాలరాస్తూ రేవంత్ రెడ్డి డైరెక్షన్లో వీసి ఇలాంటి సర్కులర్ తీయడం సరియైన విధానం కాదని, వెంటనే ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అన్ని యూనివర్సిటీల విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఈ జీవో ను వ్యతిరేకిస్తున్నాయని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.అదేకాక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాల పైన కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు, విద్యార్థి నాయకుల పైన అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని, ప్రజాపాలనను అడుగడుగునా ప్రశ్నిస్తున్నారని ప్రభుత్వం ఈ దుశ్చర్యలకు పాల్పడుతుందని వారన్నారు.మీరిచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలను అమలు చేయమంటే ఎందుకంత భయమని, 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడా అని అశోక్ నగర్‌లో చదివే విద్యార్థులు ప్రశ్నిస్తే వారి మీద లాఠీ ఛార్జ్ చేస్తున్నారని ధ్వజమెత్తారు,

చదువు కునే ప్రతి విద్యార్థినికి స్కూటీలు ఇస్తామన్నా హామీ ఏమైందని, ప్రభుత్వం వెంటనే ఆ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్వి నాయకులు పస్తం అనిల్, రసురి రాజేష్, మహేష్, గణేష్ అఖిల్ , సునీత్, హరి ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలను అధికారులు త్వరగా పరిష్కరించాలి

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**

వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ప్రజావాణి కార్యక్ర మంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు స్వీకరించారు.జిల్లాలోని పలు మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణి కార్య క్రమంలో 76 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన వివిధ సమస్యలను పెండింగ్‌లో లేకుండా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా అధికారులతో పాటు పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు

## రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ఎన్డీయే సర్కారు లక్ష్యం

**భూపాలపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఒకే దేశం ఓకే ఎన్నిక వర్క్ షాప్ అసెంబ్లీ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి మరియు జిల్లా అధ్యక్షులు ఏడు నుతులనిషిధర్ రెడ్డి హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓకే దేశం, ఒక ఎన్నిక అనే భావన భారతదేశంలో చాలా కాలంగా ఉన్న ప్రతిపాదన అని, లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ఎన్డీయే సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది.ఈ ఆలోచన వలన ఎన్నికల సామర్థ్యం యొక్క అవసరాన్ని పరిష్కరించడానికి, తరచుగా జరిగే ఎన్నికల వల్ల కలిగే ఆర్థిక మరియు పరిపాలనా భారాన్ని తగ్గించడానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. ఒకే దేశం ఒక ఎన్నిక వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా, ప్రభుత్వం ఎప్పటికీ జరిగే ఎన్నికలకు సిద్ధం కాకుండా అభివృద్ధి కార్యకలాపాలు అమలుపై దృష్టి పెట్టే అవకాశం ఉంటది.ఎన్నికల సమయంలో సాధారణ పరిపాలనా కార్యకలాపాలకు అంతరాయం ఉండదు,ఏకకాలంలో ఎన్నికలు సిబ్బంది మరియు వనరులను తరచుగా మోహరించాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రభుత్వ అధికారులు వారి పనుల మీద దృష్టి పెట్టడానికి సమయం ఉంటుంది.ఈ వ్యవస్థ పార్టీలలో రాజకీయ అవకాశాలు, బాధ్యతలను మరింత సమానంగా కేటాయించడానికి వీలు కలుగుతుంది.దీని వలన విస్తృత శ్రేణి నాయకులు ఉద్భవించడానికి వీలు కల్పిస్తుంది. మొత్తంమీద,ఒక దేశం, ఒక ఎన్నిక అనే భావన భారతదేశ ఎన్నికల ప్రక్రియను మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంది.ఈ కార్యక్రమంలో పార్ల మెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పొలసాని తిరుపతిరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షు లు సయ్యద్ గాలీఫ్ రాష్ట్ర నాయకులు బట్టు రవి జిల్లా నాయ కులు దొంగల రాజేందర్ కంబాల రాజన్న కొమరన్న,ఊరటి మునేందర్ వివిధ మండలాల అధ్యక్షులు మోరే వేణుగోపాల్ రెడ్డి, గీస సంపత్ రూలల్ కన్వీనర్ విప్లవ రెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.



## పెరిగిన హలీం ధరలు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు**

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్‌లో ఎక్కడ చూసినా హలీం ఘుమఘుమలు ఆహా అనిపిస్తాయి. గల్లీ నుంచి మొదలు కొని పేరు మోసిన రెస్టారెంట్ల వరకు హలీం అమ్మకాలు జోరుగా కొనసాగిస్తాయి. హలీం పేరుకు ముస్లీం సంప్రదాయ వంటకం అయినప్పటికీ, హిందువులు, ముస్లీంలు, క్రిస్టియన్లు అనే తారతమ్యం లేకుండా అందరూ లొట్టేలేసుకుంటూ తినేస్తారు. హైదరాబాద్ బిర్యానీ ప్రపంచ వ్యాప్తంగా ఎలా పాపులర్ అయ్యిందో, అలాగే హైదరాబాద్ హలీం టేస్టీ ఖండాంతరాలకు విస్తరించింది. రంజాన్ సందర్భంగా ఇక్కడి నుంచి ఇతర దేశాలకు హలీం ఎగుమతి అవుతుంది. ప్రతి సంవత్సరం హలీంతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది.గత ఏడాదితో పోల్చితే ఈ సారి హలీం ధరలు బాగా పెరిగాయి. చిన్న రెస్టారెంట్ల నుంచి పేరు మోసిన రెస్టారెంట్ల వరకు ధరలను పెంచాయి. కొన్ని రెస్టారెంట్లలో హలీం ధర రూ. 280గా ఉంటే.. మరికొన్ని రెస్టారెంట్లలో రూ. 340గా ఉంది. ఒక్కో రెస్టారెంట్ లో ధర ఒక్కోలా ఉంది. ముడిపదార్థాల ధరలు పెరగడం.. ముఖ్యంగా మటన్, మసాలా దినుసుల రేట్లు గతంతో పోల్చితే ఈసారి మరింత పెరిగినట్లు రెస్టారెంట్ల యజమానులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే హలీం రేట్లు పెంచినట్లు వెల్లడించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాదికి మసాలా దినుసుల రేట్లు 25 శాతం వరకు పెరిగాయంటున్నారు. మటన్ రేట్లు కూడా గత ఏడాది కంటే ఈసారి ఎక్కువ కావడంతోనే హలీం రేట్లు పెంచక తప్పలేదంటున్నారు రెస్టారెంట్ యజమానులు.ఇక రంజాన్ మాసంలో హలీంకు ఓ రేంజ్ లో డిమాండ్ ఉంటుంది. అన్ని ఆన్ లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్.. ముఖ్యంగా జొమాటో, స్విగ్గీ, ఉబర్ ఈట్స్ లో పెద్ద మొత్తంలో ఆర్డర్లు లభిస్తున్నాయి. అయినప్పటికీ హలీంకు ఆఫ్ లైన్ లోనే భారీగా డిమాండ్ ఉంటుంది. సాయంత్రం అయితే చాలు, రెస్టారెంట్ల ముందు హలీం ప్రియులు క్యూలు కడుతున్నారు.

## మార్కెట్ కమిటీలో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చాం

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :**

మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఒకే దఫాలో రూ. 2లక్షల రుణమా పీపై బీఆర్ ఎస్, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి. మార్కెట్ కమిటీలో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చాం. రైతులకు ఒకేదఫాలో రుణమాఫీ చేసిన ఘనత కాం గ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏక కాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తే కళ్లులేని కబోదిళ్లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం ఆధారిత కొత్త పరిశ్రమలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తు న్నారని మంత్రి చెప్పారు.కొత్త పరిశ్రమలకు రంగారెడ్డి జిల్లా అన్నదాతల భూముల త్యాగమే ఇక్కడి అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.... వ్యవసాయ మార్కెట్ కమిటీలో అన్ని వర్గాలకు, కులాలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని కేఎల్ఆర్ చెప్పారు. రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగమే నేటి యువతకు కొత్త ఉద్యోగ అవ కాశాలు అన్నారు. కొత్తకమిటీ కర్షకలోకానికి మంచి చేయాలని, అవగాహన పెంచాలని రైతు బిడ్డ లక్ష్మారెడ్డి చెప్పారు.తుక్కుగూడలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌కు ఘనస్వాగతం పలికారు.





## పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం
# మెను పాటించాలి

**కమలాపూర్,తెలంగాణ ముచ్చట్లు :**
కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం సరైన విధంగా అమలవడం లేదని స్థానిక నేతలు ఆరోపించారు. పథకం ప్రకారం భోజన మెను పాటించకపోవడంతో విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం లేదని వారు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాలలో భోజన మెను డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేసి, విద్యార్థులకు మెను ప్రకారమే ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. భోజన నాణ్యతను కాపాడటానికి స్కూల్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే, వారానికి మూడు గుడ్లు అందేలా చూడాలని, పాఠశాల స్థాయిలో భోజన పర్యవేక్షణ కమిటీ పేర్లను డిస్ప్లే బోర్డులపై ప్రకటించాలని కోరారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కమలాపూర్ మండల అధ్యక్షుడు కత్తి రమేష్, టౌన్ అధ్యక్షుడు ఎడ్ల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ సంఘం నాయకుడు బొచ్చు కర్ణాకర్, ఎగ్గడి సతీష్ పాల్గొన్నారు.

# ఫిక్స్డ్ వేతనం ప్రకటించాలి




**ములుగు,తెలంగాణ ముచ్చట్లు :**
తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 18 వేల రూపాయల ఫిక్స్డ్ వేతనం వెంటనే ప్రకటించాలని ములుగు మండల తహసిల్దార్ విజయభాస్కర్‌కి సిఐటీయు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా హర్షవర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి మాట్లాడుతూ ఆఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీని పిలుపుమేరకు ములుగు జిల్లాలో 9 మండలాల తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి 9 మంది తహసీల్దారులకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం అనేది నిర్ణయించేసి ఇవ్వకుండా పారితోషికాల పేరుతో శ్రమ దోపిడీ చేస్తుందని అన్నారు. గతంలో హెల్త్ కమిషనర్‌తో చర్చలు సందర్భంగా ప్రమాద బీమా కల్పిస్తామని ఇంతవరకు ఇవ్వలేదని అన్నారు. పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఆశా కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు జారీ చేయాలనీ.ఎల్సిడిసి, పోలియో ఎన్సిడి తదితర సర్వేల డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారిని ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలని అన్నారు.గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్నా 6 నెలల వెంటనే ఇవ్వాలని అన్నారు.ఈ అసెంబ్లీ సమావేశాలలో ఫిక్స్డ్ వేతనం ప్రకటించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చంచు మంజుల, కవిత,గుండెబోయిన రమాదేవి, రేణుక, సభిత, పద్మ, అరుణ, జ్యోతి, సుజాత, యశోద, సునీత. ధనలక్ష్మి. ఈశ్వరి. స్వర్ణ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై
# అభ్యంతరాల స్వీకరణ

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితా ఫారం 6, 7, 8ల సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ నిర్వహించారు. సోమవారం హనుమకొండ లోని ఆర్డీవో కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితాలో నూతన, ఓటర్ల మార్పుచేర్పులు, ఒక నియోజకవర్గంలో నుంచి మరొక నియోజకవర్గ మార్పులు చేర్పులు, చిరునామా మార్పిడి దరఖాస్తు చేసుకునే విధంగా బిఎల్వోల వద్ద నమోదు చేసుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆర్డీవో కోరారు. బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను ఇవ్వాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు అభ్యంతరాలు తెలియజేయడంతో పాటు సూచనలు చేశారు.ఈ సమావే శంలో ఎన్నికల విభాగం నాయబ్ తహసిల్దార్ సిరంగి విఠలేశ్వర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎండి నేహాల్, రావు అమరేందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, శ్యామ్ సుందర్ , సయ్యద్ ఫైజుల్లా, పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు
# అన్ని రంగాల్లో రాణించాలి

**భూపాలపల్లి, తెలంగాణ ముచ్చట్లు :**



విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జయశంకర్ జిల్లా విద్యాశాఖాధికారి రాజేందర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాలు ఘనం గా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాశాఖ అధికారి రాజేందర్ హాజరై మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు కావున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బానోత్ దేవా నాయక్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంత కుమారి,ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజలకు పులుల టెన్షన్..?

**వరంగల్ , తెలంగాణ ముచ్చట్లు :**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రజలకు పులుల టెన్షన్ పట్టుకుంది. అటవీ ప్రాంతంలోని గ్రామాల శివార్లలో పులి సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపించడం, అడపాదడపా మూగ జీవాలపై అటాక్ చేస్తుండటంతో అక్కడి ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రెండు పులుల సంచారం జనాలను కలవరానికి గురిచేస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ఏజెన్సీ ప్రాంతంలో ఆడ పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలోని అన్నారం క్రాస్ బీరసాగర్ పోచమ్మ ఆలయం వద్ద రెండు రోజుల కిందట కొంతమంది వాహనదారులు పులిని చూసినట్టు చెబుతున్నారు. అటుగా వచ్చిన పులిని గమనించి, గ్రామస్థులకు సమాచారం చేరవేయగా.. ఆ విషయం కాస్త వైరల్ అయ్యిందిగ్రామస్థులు సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. పులి జాడను కనుగొనే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్యంగా పులి పాద ముద్రలను గుర్తించారు. మహదేవపూర్ అటవీ ప్రాంతంలో సంచరిస్తుంది ఆడ పులిగా భావిస్తున్నారు. పులిని గుర్తించేందుకు అటవీ ప్రాంతంలో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. తరచూ పులి కదలికలతో మహదేవపూర్ మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఓ వైపు మహదేవపూర్ ఏజెన్సీ ఏరియాలో ఆడపులి సంచరిస్తుండగా..

భూపాల పల్లి, కాటారం మండలాల్లో మగపులి తిరుగుతుండటంతో జనాలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం



పులి కదలిక లను గుర్తించిన కొందరు స్థానికులు.. అట వీ శాఖ అధికారులకు సమాచారం చేరవే యడంతో వెంటనే జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్లు కాటారం, భూపాలపల్లి మండలాల్లో పర్యటి ంచారు. అక్కడున్న పులి అడుగులను గుర్తించి, దానిని మగపులిగా భావిస్తున్నారు. మహదేవపూర్, కాటారం మండలాల్లో సంచరించేది ఒకటే పులి అని భావిం చారు. కానీ అక్కడున్న అడుగులు, ఇక్కడున్న అడుగులకు సరిపోలకపోవడంతో రెండు పులులు సంచరిస్తున్నట్టుగా నిర్ధారణకు వచ్చారు. కాటారం మండలంలో పులి అడు గులు గుర్తించి, అది మగపులిగా తేల్చారు. ఆ పులి కాటారం మండలం మేడిపల్లి, కొత్తపల్లి మీదుగా భూపాలపల్లి మండలం రాంపూర్, కమలాపూర్ గ్రామ శివార్లలో సంచరిస్తుండటంతో.. అటు గ్రామస్థులతో పాటు ఆఫీసర్లు కూడా అలర్ట్ అయ్యారు. జిల్లాలో రెండు వైపులా రెండు పులులు సంచరిస్తుండటంతో కాటారం, మహదేవపూర్ మండలాల్లో టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. జనాలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. కనీసం పశువులను మేతకు తీసుకెళ్లాలన్నా భయాందోళన చెందుతున్నారు. పులుల సంచారం నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సమీప గ్రామాల ప్రజలను అలర్ట్ చేసే పనిలో పడ్డారు. అటవీ ప్రాంతాల్లోకి పశువుల కాపరులు ఎవరూ వెళ్లొద్దని సూచిస్తున్నారు. పంట పొలాల వద్ద కరెంట్ తీగలు, ఉచ్చులు పెట్టొద్దని, ఒకవేళ ఎవరైనా పులులను హాని కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఒకవేళ ఎవరికైనా పులి ఎదురైతే దాని కళ్లలోకి నేరుగా చూడొద్దని, వెనక్కి తిరగకుండా వెనక్కి నడవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పరుగెత్తకూడదని, పెద్ద శబ్దం చేస్తూ ఉండాలని సూచించారు. ఎవరికైనా పులి కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

# వినియోగదారుల సంఘాల కమిటీచే సన్మానం

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
ప్రపంచ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా జరిగిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ వారు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్‌లో రాష్ట్ర వినియోగదారుల హైకోర్టు జడ్జి జస్టిస్ మీనా రామనాదన్ ,బ్యూరో ఆఫ్ ఇండియన్ త్టాండర్డ్స్ చైర్మన్ రాష్ట్ర కాట్కో చైర్మన్ ,కార్యదర్శి చౌరస్య, వెంకటేశ్వర్లు కమిటీ మెంబర్‌లు అందరూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో సంబంధిత అధికారులతో కలిసి ఫైవ్ స్టార్ హోటల్ లలో అపరి శుభ్రత,కల్తీ లు,పెట్రోల్ బంకుల్లో కల్తీ కొలతల్లో తేడాలు వే బ్రిడ్జిల్లో,బంగారం శాపుల్లో ధాన్యం కొనుగోలులో రేషిన్ స్టాక్ పాయింట్లతో ఎనుమాముల మార్కెట్ మొదలైన వాటిల్లో మోసాలు, తేడాలు, ఆర్టీఏ అధికారుల ద్వారా వాహనాల తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకునేటట్లు చేసి వినియోగ దారులను చైతన్య పరుస్తూ విద్యార్థులు,




ప్రజలకు చట్టం హక్కుల చట్టం వినియోగం తెలుపుతున్నందుకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉద్యమ వినియోగ నాయకునిగా గిరగాని సుదర్శన్ గౌడ్‌ను గుర్తించి ఘనంగా సన్మానం చేశారు.

# రోగులకు శాశ్వత తాగునీటి సౌకర్యంకు ఏర్పాట్లు

**ఆసుపత్రి వైద్యుల సొంత ఖర్చులతో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేస్తున్నాం**

**మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కోరాము**

**ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం : ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ విజయ్ కుమార్**



**వర్ధన్నపేట, తెలంగాణ ముచ్చట్లు :**
వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ విజయ కుమా ర్ తెలిపారు. ఆసు పత్రిలో తాగునీటి సౌక ర్యం లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆర్ఎంఓ డాక్టర్ విజయ్ కుమార్ స్పందించారు.గత సంవత్సర కాలంగా ఆసుపత్రిలో నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు తమ సొంత ఖర్చులతో ఆసుపత్రిలో శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో శాశ్వత తాగునీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. తాగునీటి సౌకర్యం కోసం మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్‌ను సంప్రదించా మని ఆస్పత్రికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. అందుకు మున్సిపల్ కమిషనర్ సానుకూ లంగా స్పందించి వెంటనే ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారని తెలిపారు. గత సంవత్సర కాలంగా వర్ధన్నపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వర్ధన్నపేట చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలకు అందుబా టులో ఉంటూ నిరంతరం వైద్య సేవలు అందిస్తు న్నామని వైద్య సేవలతో పాటు ఆసుపత్రిలో ఆహ్లాదక రమైన వాతా వరణం నెలకొనే విధంగా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ సేవలందిస్తు న్నామని పేర్కొన్నారు. ఇప్ప టికే గత పది రోజులుగా తమ సొంత ఖర్చులతో తాగునీటి సౌకర్యం కల్పిస్తు న్నామని ఇకముందు ఆసుపత్రిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు శాశ్వత





పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రికి వైద్య సేవల నిమి త్తము వచ్చే రోగులకు వారితో వచ్చే కుటుంబ సభ్యులకు తగిన సేవలు అందించడానికి ఆసుపత్రి సిబ్బంది సిద్ధంగా ఉందని ఆసుపత్రిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# ఎస్సైపై సీపీకి పిర్యాదు

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
ఐనవోలు ఎస్సై నన్ను డబ్బుల కోసం వేదిస్తున్నడని మేరుగు రమేష్ అనే వ్యక్తి సిపికి ఫిర్యాధు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భాదితుడు ఫిర్యాధులో పేర్కోన్న వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని శివారులో సర్వే నెంబర్ 323లో ఫంక్షన్ హాలు నిర్మాణం చేపడుతున్నాను.యిట్టి నిర్మాణాణం చేపడు తున్న క్రమంలో మాకు భూమి విక్రయించిన వారు నన్ను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దింతో నేను కోర్టు నుంచి ఇన్జెక్షన్ ఆర్డర్ తీసుకొని స్థానిక ఎస్ఐకి, ఏసిపికి ఫిర్యాదు చేశాను. దినికి స్పందించకుండా నాపైనే అన్యాయంగా ఎఫ్ ఐఆర్ నమోదు చేశారు. తనను డబ్బులు కోసం వేదిస్తున్నట్లు తన దగ్గర ఆధారాలు ఉన్నాయని, యిట్టి లా వాదేవిలు ఎస్సై, హెూంగార్డు భాస్కర్‌కు తెలుసని ఫిర్యాధులో పేర్కోన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో
# రక్తదాన శిబిరం

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులోని జిల్లా ఖజానా కార్యాలయం ప్రాంగణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానా అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలసేమియా బాధితుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో ఔత్సాహికులు, రక్త దాతలు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. రక్తదాతలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం ఉదయం 9:30 గంటలకు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని డీటీవో శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు.

## విద్యార్థులపై దురుసుగా ప్రవర్తించిన వార్డెన్
# సదానందంపై చర్యలు తీసుకోవాలి


**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు :**
స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఎల్తూరి సాయికుమార్ మాట్లా డుతూ కాకాజీ కాలనీలోని ఎస్సీ హాస్టల్‌లో గత నెల ఫిబ్రవరి 21న వార్డెన్ సదానందం విద్యార్థులపై దురుసుగా ప్రవ ర్తించి విద్యార్థుల చేయి విరిగే లా కొట్టిన విషయం అందరికీ తెలిసిందే కానీ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమైన విషయం అదే విధంగా ఈ సంఘటన జరిగి 25 రోజులు అవుతున్న ఇప్పటివరకు స్థానిక ఎస్సీ డీడీ స్పందించకపోవడం వారిపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈరోజు స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్ ముందు ధర్నా నిర్వహించి విద్యార్థులకు న్యాయం జరిగేలా అండగా ఉంటామని తెలిపారు. అదే విధంగా వార్డెన్ సదానందం వెంటనే విధుల నుంచి పూర్తిగా తొలగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. నోటీసులకే పరిమితం చేసి విద్యార్థులకు అన్యాయం చేయాలని చూస్తున్న ఏ అధికారులనైనా వదిలిపెట్టొద్దని తెలియజేయడం జరుగుతుంది లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు చెట్టుపల్లి శివకుమార్ , రాజ్ కుమార్ ,చరణ్ ,రఘు, శ్రీరామ్ ,కృష్ణ ,ప్రవీణ్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే హరీష్ రావుకు గ్రామస్థుల సన్మానం



**చిన్నకోడూరు, తెలంగాణ ముచ్చట్లు :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని శంకరయ్య కుంటను నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసిన సందర్భంగా గ్రామ ప్రజలు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావుని కలిసి సన్మానం చేశారు.గ్రామంలో నీటి కాలువలను, బ్రిడ్జి, బీటీ రోడ్డు వంటి సమస్యలను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరం వెంకటేశ్వర్లు, కనకరాజు రాములు ,సత్తయ్య వెంకటేశం, దేవరాజు , మహేష్ గంగపుత్ర యూత్ ప్రెసిడెంట్ మాకు మహేష్, పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చిన్నకోడూరు,తెలంగాణ ముచ్చట్లు :**

కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ,సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద బడుగు బలహీన వర్గాల వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది, అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న చెర్ల అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిమ్మాపురం శ్రీకర్, చంద్లపూర్ గ్రామానికి చెందిన బాల్లింగ్ ప్రవళికలకు మంత్రి క్యాంప్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి చిక్కుడు అనిల్ కుమార్, చిన్నకోడూరు మండలం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల రాజు యాదవ్ ఎన్ఎస్ఐ విద్యార్థులు బైరోజు రాకేష్, తిమ్మాపురం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులను అవమానపరుస్తున్న బీఆర్ఎస్



**చిన్నకోడూరు, తెలంగాణ ముచ్చట్లు :**

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ని శాసనసభలో ఈ సభ నీ సొంతం, నీ జాగిరి కాదు అని అహంకారంతో మాట్లాడిన జగదీష్ రెడ్డినీ, అందుకు సహకరించిన కేటీఆర్, హరీష్ రావ్‌లను వెంటనే శాసన సభ నుండి బర్తరఫ్ చేయాలనీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేం దర్ యాదవ్ డిమాండ్ చేసారు. సోమవారం మండల కేంద్రంలో జగదీశ్వర్ రెడ్డి, కేటీఆర్, హరీష్ రావ్‌ల దిష్టి బొమ్మను దహనం చేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తరువాత బి ఆర్ ఎస్ దళితుణ్ణి ముఖ్య మంత్రి చేస్తానని మాట ఇచ్చిన కేసీఆర్ మాట తప్పడమే కాకుండా ఒక దళితుడు ఉప ముఖ్యమంత్రి అయితే ఓర్వలేక మంత్రి పదవి నుండి తొలగించి దళితులను రెండవసారి మోసం చేసారు అని గుర్తు చేసారు అంతేకాకుండా దళితులకు మూడు ఎకరాల భూమి అని, దళిత బంధు అని అనేకసార్లు దళి తులపై వివక్ష చుపారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే దళితులపై వున్నా చిత్త శుద్ధితో ఉప ముఖ్య మంత్రి పదవి మరియు శాసన సభ స్పీకర్ పదవి దళిత నాయకులకు ఇచ్చి గౌరవించింది అన్నారు అదే విధంగా అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షత పదవి కూడా ఒక దళిత నాయకుడికి ఇచ్చి దళితులపై వున్నా చిత్తశుద్ధినీ కాంగ్రెస్ పార్టీ తెలియజేసింది అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉప అధ్యక్షులు, సందబోయిన పరశురాం, సెక్రటరీ కొరిమి రాజు, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ఉడుత ప్రశాంత్, ఫిషర్ మెన్ జిల్లా కార్యదర్శి గుండు వెంకట్, బత్తిని గణేష్, నాయకులు నముండ్ల వినోద్, కాల్వ జగన్, కొమ్ము ఎల్లయ్య, గుడిమల్ల మల్లేశం, పాకాల శ్రీకాంత్ రెడ్డి, రాజు, అనిల్, శ్రీకాంత్, కర్రె మధు,పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



**నర్సంపేట, తెలంగాణ ముచ్చట్లు :**

నర్సంపేటకు చెందిన వ్యాపారి గోనెల రవీందర్ వరంగల్ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా నర్సంపేట సిటిజన్ ఫోరం బాధ్యులు డాక్టర్ పెండెం భాస్కర్, చెరుకుపల్లి గోపాల్ రెడ్డి కోడెం శ్రీధర్ కొధాటి గోపాలకృష్ణ, జీజుల సాగర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గుంటి కిషన్ తదితరుల సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి

**ఐనవోలు, తెలంగాణ ముచ్చట్లు :**

అనారోగ్యంతో మాజీ ఎంపిటిసి బోయినపల్లి సోమేశ్వర రావు మృతి చెందారు.ఐనవోలు మండలంలోని పంథిని గ్రామానికి చెందిన సోమేశ్వర రావు సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ తన నివాసంలో మృతి చెందారు. సోమేశ్వర రావుకు వర్ధన్నపేట నియోజకవర్గంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో సత్సంబంధాలు ఉండి సౌమ్యుడిగా పేరుంది. సోమేశ్వర రావు మృతితో గ్రామం శోక సంద్రంలో మునిగింది. అంత్యక్రియలు మంగళవారం పంతిని గ్రామంలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.ఆయన మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి చెంది తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు.

# నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలి



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :** వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు నీటి సరఫరాలో అవాంత రాలు లేకుండా చూడాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్ది యా కమిషనర్ అశ్వినితానాజీవాకడేతో కలిసి మేయర్ నగర పరిధి లోని వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ బాలాజీ నగర్ ఖాజీపేట విష్ణుపురి సోమిడిలో గల ఈఎస్ఎల్ఆర్‌లను క్షేత్ర స్థాయిలో పరిశీ లించి సమర్థవంతంగా నిర్వహించుట కు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయ ర్ కమిషనర్‌లు వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌ను సం దర్శించి నీటి సరఫరా తీరు శుద్దీకరణ విధానంను అడిగి తెలుసుకొని ఫిల్టర్ బెడ్ నుండి ఎన్ని ప్రాంతాలకు నీరు సరఫరా జరుగుతుంది అని అడిగి తెలుసుకున్నారు. వడ్డేపల్లి జంక్షన్‌కు చేరుకొని జంక్షన్ విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించి ఎన్‌జీఓస్ కాలనీ వైపు ప్రజల సౌకర్యార్థం రోడ్‌కు అడ్డంగా ఉన్న ఎలక్ట్రికల్ పోల్‌ను తొలగించాలని అధికారుల ను ఆదేశించారు. బాలాజీ నగర్ ఖాజీపేట విష్ణుపూరిలోని ఈఎస్ఎల్ఆర్‌లను సందర్శిం చి స్థానిక కార్పొరేటర్‌ను నీటి సరఫరా తీరు గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. బల్దియా కాకుండా ఇతర డిపార్ట్మెంట్ వారు అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో బల్దియా నుండి ఎన్‌ఓసి పొందిన తర్వాతే పనులు చేపట్టేలా చూడాలని అధికారులకు సూచించారు.అనంతరంసోమిడి రోడ్డులో వాట ర్ సప్లై సరఫరా తీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్ విజయ శ్రీ రజాలే ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి హెచ్ఓ రమేష్ ఈఈలు మహిందర్ మాధవి లత డిఈలు సారంగం కార్తీక్‌రెడ్డి ఏఈ సరిత పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించండి

**బల్దియా కమిషనర్ అశ్వినితానాజీవాకడే**

**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీవాకడే అధికారులను ఆదేశించారు. సోమ వారం ప్రజా వాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమితం వివిధ విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు.

**వివరాలు విభాగాల వారిగా..**

1.ఇంజనీరింగ్....24
2.హెల్త్ అండ్ సానిటేషన్.....04
3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...10
4.టౌన్ ప్లానింగ్...46
5.మంచినీటి సరఫరా.......04
మొత్తం = 88

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర సిఏంహెచ్ఓ డా.రాజారెడ్డి బయలజిస్ట్ మాధవ రెడ్డి హెచ్ఓలు రమేష్ లక్ష్మారెడ్డి ఇన్చార్జి సిపి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలి



**వర్ధన్నపేట, తెలంగాణ ముచ్చట్లు :**

రైస్ మిల్లు యజమాన్యాలపై రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ వరంగల్ జిల్లా కమిటీ కార్యదర్శి వల్లందాస్ కుమార్ ఫిర్యాదు చేశారు. వర్ధన్నపేట మండలం లోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉన్న కొంతమంది రైస్ మిల్లుల యజమాన్యాలు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకో కుండా అక్రమంగా రైస్ మిల్లులు నడుపుతు న్నారని, అలాంటి అక్రమ రైస్ మిల్లుల యజ మాన్యాలను గుర్తించి వెంటనే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో వరంగల్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాధు చేసినట్టు తెలిపారు. ఇల్లంద వ్యవ సాయ మార్కెట్ పరిధిలో 26 రైస్ మిల్లులు ఉన్న ప్పటికీ ఇందులో కేవలం మూడు రైస్ మిల్లుల యజమాన్యాలు మాత్రమే ప్రభుత్వం నుండి అను మతులు తీసుకున్నారని, మిగతా 23 రైస్ మిల్లుల యజమా న్యాలు ప్రభుత్వం నుండి ఎలాంటి అను మతులు తీసుకోకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రైస్ మిల్లులను నడుపుతున్న రైస్ మిల్లుల యజమాన్యంతో సంబంధిత అధికారులు కుమ్మక్కై చూసి చూడనట్టుగా వ్యవహరించడంతో ప్రభుత్వం నుండి అనుమతులు లేని రైస్ మిల్లుల యజమా న్యాలు ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే ఆదాయానికి గండికొడుతూ ప్రభుత్వానికి ఎలాం టి పనులు చెల్లించకుండా మిల్లు యజమా న్యాలు దళారి వ్యవస్థను సృష్టించుకొని ఇల్లందు వ్యవసా య మార్కెట్‌ను రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్లులను గుర్తించి సీజ్ చేసి మిల్లుల యజమా నులపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి ఏప్రిల్ నెలలో రాబోవు రబీ సీజన్‌కు ప్రభు త్వం నుండి అనుమతులు లేని రైస్ మిల్లులకు సిఎంఆ ర్‌ను నిలిపి వేయాలని ఫిర్యాదులో పేర్కొ న్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటికి వస్తాయన్నారు.

# సభ స్థలాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

పాలకులు మారిన, పరిస్థితులు మారని ఎంజీఎం హాస్పిటల్ పరిస్థితిలపై భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 19న నిర్వహిస్తున్న వరంగల్ ప్రజల ఆత్మ గౌరవ పోరాటం మహాధర్నా కార్యక్రమం సభ స్థలాన్ని బిజెపి నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షులు గంట రవికుమాం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకుల రఘునారెడ్డి, మాచర్ల దీన్ దయాల్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్ , ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోవింద్ సింగ్, కార్యాలయ సెక్రటరీ పెద్ది నవీన్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, డివిజన్ అధ్యక్షులు జెట్లింగ్ శివప్రసాద్, తోట సురేష్, బిజెపి నాయకులు కందుకూరి శ్రీనివాస్, విట్టల్ బోర మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో లంక శివ కుమార్ – నాగలక్ష్మి దంపతుల కుమార్తె లంక శ్రీవల్లి పుట్టిన రోజు సందర్భంగా వారి సహకారంతో లూయిస్ అందుల ఆదర్శ పాఠశాల ఆటోనగర్, వరంగల్‌లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లంక శివ కుమార్ – నాగలక్ష్మి, లంక శ్రీవల్లి, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వి, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవి కుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మండల భూపాల్, మోడెం రాజశేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

# బంగారు లక్ష్మణ్ 86వ జయంతి



**వరంగల్, తెలంగాణ ముచ్చట్లు :**

దళిత హక్కుల ఉద్యమ నేత, కార్మిక నాయకుడు, భారతీయ జనతా పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్ 86వ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించారు. వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ ఆధ్వర్యం లో తూర్పు నియోజకవర్గంలో కాశిబుగ్గ వెల్ఫేర్ సొసైటీలోని ఓ అనాధ ఆశ్రమంలో కేకు కట్ చేసి నిత్యవసర వస్తువులను అందజేశారు.

# సమ్మర్ వార్‌లో కుర్ర హీరోలు





**తెలంగాణ ముచ్చట్లు, సినిమా :**
వేసవి సెలవులు వస్తుండటంతో ఇక బాక్సాఫీస్ వద్ద సినిమాల సందడి ఊపందుకోనుంది. మార్చి నెలాఖరు నుంచే వరుసగా సినిమాలు రిలీజ్ అవుతుండగా.. ఏప్రిల్‌లో ఆసక్తికరమైన పోటీ ఎదురుకానుంది. యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డ, మరో యువ నటుడు ప్రదీప్ మాచిరాజు ఒకరి తర్వాత మరొకరు వార్‌లోకి దిగబోతున్నారు. సిద్ధు నటిస్తున్న 'జాక్' ఏప్రిల్ 10న, ప్రదీప్ మాచిరాజు నటించిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ఏప్రిల్ 11న విడుదల కానున్నాయి... దీంతో ఈ పోటీలో ఎవరు విజేతగా నిలుస్తారో అన్న అంశం ఆసక్తిగా మారింది.'టిల్లు స్క్వేర్'తో 100 కోట్ల క్లబ్‌లో చేరిన సిద్ధు జొన్నలగడ్డ 'జాక్' తో మరో హిట్ కొట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వం, 'బేబీ' ఫేమ్ వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తుండటంతో యూత్‌లో క్రేజ్ నెలకొంది. పైగా ఇప్పటికే విడుదలైన ఓ సాంగ్ మరింత హైప్ క్రియేట్ చేసింది. ప్రమోషన్ కంటెంట్ కూడా సినిమాపై అంచనాలు పెంచడంతో ఈ మూవీ కోసం యూత్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. మరోవైపు '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' సినిమాతో హీరోగా అలరించిన ప్రదీప్.. ఈసారి రూరల్ లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో వస్తున్నాడు. ఇందులో దీపికా పిల్లి హీరోయిన్. ఇప్పటికే రిలీజైన పాటలు మ్యూజిక్ లవర్స్‌ను మెప్పించాయి. దీంతో ఇద్దరు హీరోలకు పాత మేజిక్ రిపీట్ అవుతుందా లేదా అన్న క్యూరియాసిటీ పెంచుతోంది. ఇదిలా ఉంటే రెండు సినిమాల మేకర్స్ తమ చిత్రాలపై గట్టి నమ్మకంతో ఉన్నారు. 'డీజే టిల్లు'తో యూత్‌లో స్ట్రాంగ్ బేస్ వేసుకున్న సిద్ధు.. ఈసారి కూడా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌తో వస్తుండటం వల్ల.. తప్ప కుండా 'జాక్' ఆకట్టుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇక గత మూవీ '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' సినిమాలాగే అక్కడ 'అమ్మాయి ఇక్కడ అబ్బాయి' గ్రామీణ నేపథ్య ంలో రూపొందడంతో ఈ లవ్ స్టోరీ ఆకట్టు కుంటుందని మేకర్స్ ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు. ఈ రెండు సినిమాలు వేర్వేరు బ్యాక్ డ్రాప్స్‌తో వస్తున్నప్పటికీ వెంటవెంట రిలీజ్ డేట్స్‌తో పోటీ పడుతున్నాయి. రెండూ హిట్ అయితే ఎవరికీ నష్టం లేదు... ఒకవేళ ఈ రెండి ంటిలో ఏది కాస్తంత అటూ ఇటూగా ఉన్నా మరో దానికి అది కలిసి వచ్చే అంశం. ప్రస్తు తానికి అప్పర్ హ్యాండ్‌లో ఉన్న సిద్ధుతో ప్రదీప్ కనీసం సమానంగా హిట్ కొడతాడేమో చూడాలి.



## అద్భుతాలు జరగాలని ఎదురుచూడొద్దు..

**తెలంగాణ ముచ్చట్లు, సినిమా :**
విజయ్ వర్మతో బ్రేకప్ వార్తలతో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది మిల్కీబ్యూటీ తమన్నా లస్ట్‌స్టోరీస్-2 చిత్రంలో వీరిద్దకూ కలిసి పని చేశారు. అలా ప్రేమలో పడినట్లు ఇద్దరూ చెప్పారు. కానీ ఇప్పుడు ఈ జంట అభిప్రాయ భేదాలతో విడిపో యారంటూ వార్తలొస్తున్నాయి. ఎప్పుడూ హాట్‌హాట్ ఫొటోలు, తన సినిమా అప్‌డేట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసే తమన్నా తాజాగా ఒక సందేశాత్మక పోస్ట్ పెట్టింది. జీవితంలో అద్భుతాలు జరగాలని ఎదురుచూడొద్దని ఆమె కోరారు. దాని బదులు మనమే అద్భుతాన్ని సృష్టించాలని అన్నారు. తమన్నా, నటుడు విజయ్ వర్మ రెండేళ్ల ప్రేమ బంధానికి ముగింపు పలికారంటూ ప్రచారం జరుగుతోన్న వేళ ఆమె పెట్టిన ఈ సందేశం నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. రవీనాటాండన్ నివాసంలో ఇటీవల జరిగిన హెూలీ వేడుకలకు సైతం వీరిద్దరూ విడివిడిగా వచ్చి వెళ్లారు. ఫొటో ల్లోనూ ఇదే దూరం కనిపించింది. ఆమె షేర్ చేసిన ఫొటోల్లో విజయ్ లేడు. ఆయన పంచుకున్న ఫొటోల్లో ఆమె కనిపించలేదు. దీంతో వీరిద్దరూ విడిపోయారనేది నిజమేనని తెలుస్తోంది. దీనితో పాటు ఆమె తన స్నేహితులతో కలిసి పార్టీ చేసుకు న్న ఫొటోలను సైతం అభిమానులతో పంచుకు న్నారు. రాషా థడానీ, మనీశ్ మల్హోత్రలతో కలిసి దిగిన ఈ ఫొటోల్లో ఆమె ఆనందంగా కనిపించారు. తమన్నా పెట్టిన ఈ పోస్టులు చూసిన నెటిజన్లు లవ్ ఫెయిల్ అయిందనే బాధ నుంచి బయటకు వచ్చే ప్రయత్నాల్లో మిల్కీ బ్యూటీ ఉందని భావిస్తున్నారు. బాలీవుడ్‌లో జరిగిన ప్రతి పార్టీ, సినిమా ఈవెంట్స్‌లో కలిసి సందడి చ్టేసవారు. తమన్నా. విజయ్ వర్మ. ఈ ఏడాదిలో వీరి పెళ్లి ఉంటుందని భావించిన తరుణంలో విడిపోయారనే కథనాలొచ్చాయి. ప్రస్తుతం తమన్నా 'ఓదెల 2' (ఈవెంట్స్‌కు ఆమె ఒంటరిగా హాజరుకావడంతో ఈ ప్రచారం జరిగింది. పెళ్లి, కెరీర్ విషయంలో మనస్పర్థలు రావడంతోనే ఈ జంట ప్రేమకు ఫుల్‌స్టాప్ పెట్టేసి నట్లు తెలుస్తోంది. తమన్నా పెళ్లికి ఓటు వేయగా.. విజయ్ మాత్రం అందుకు సముఖత వ్యక్తం చేయలే దట. వివాహానికి ఇంకాస్త సమయం కావాలన్నాడ ని బాలీవుడ్ టాక్.

# రోత స్టెప్పును రీ-క్రియేట్ చేయొద్దు ప్లీజ్!

**తెలంగాణ ముచ్చట్లు, సినిమా :**
సినిమా అనేది ఎవరికైనా ఓ రిలీఫ్. సినిమా పాటలు మనల్ని మరో ప్రపంచంలోకి తీసుకె ళ్తాయి. కాస్త బోర్ కొట్టినా... మూడ్ ఆఫ్ లో ఉన్నా... పాటలు వింటూ చిల్ అవుతుంటారు మ్యూజిక్ లవర్స్. కానీ ఇప్పుడు కొన్నిపాటలు విన్నాలన్నా, చూడాలన్నా ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సి వస్తోంది. జోష్‌ను నింపే పాటలు ఆడియెన్స్‌కు ఇబ్బందికరంగా మారు తున్నాయి. ప్రతి సినిమాలో, ప్రతి పాటలో డబుల్ మీనింగ్ పదాలతో పాటు రెచ్చిపోయి మరి చిందులు వేస్తుండటం ఇబ్బందికరంగా మారుతోంది. అది ఐటమ్ సాంగ్ అయితే ఇక చెప్పక్కర్లేదు. ఫ్యామిలీ ఆడియెన్స్ వింటారనే మినిమమ్ కామన్ సెన్స్ లేకుండా మేకర్స్ పాటలను డిజైన్ చేస్తున్నారు. దీంతో 'ఎవర్రా మీరంతా? బాధ్యత ఉండక్కర్లేదా!?' అని అడుగుతున్నారు నెటిజన్లు.యూత్ ను టార్గెట్ చేస్తూ వస్తున్న కొన్ని పాటలు హద్దులు దాటుతున్నాయి. ఫ్యాన్స్‌ను ఖుషీ చేసేందుకు మేకర్స్ మరి దిగజారిపోతున్నారు. ఇవి సినిమా పాటలేనా అనుకునే దుస్థితి దాపురి స్తోంది. రీసెంట్‌గా కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ హీరోహీరోయిన్లతో వేయిస్తున్న స్టెప్పు లు విమర్శలకు దారితీస్తున్నాయి. ఓ వైపు విమర్శల వర్షం కురుస్తున్నా... మరోవైపు పాట ఎలా ఉన్నా... క్యాచీ లైన్స్ ఉండటంతో రీల్స్ మోత మోగిస్తున్నారు అమ్మాయిలు. సేమ్ అలానే రెడీ అయి మరీ... సెప్పులేస్తున్నారు. రాను రాను ఈ కల్చర్ పెరిగిపోతుండటంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తుంటే... మరి కొందరు తమ స్వరం వినిపిస్తున్నారు. తాజాగా 'ఆట' సందీప్ భార్య జ్యోతిరాజ్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.తాజాగా 'రాబిన్ హుడ్' మూవీ నుండి రిలీజైన 'అది దా సర్‌ప్రైజ్' స్పెషల్ సాంగ్ రిలీజ్ అయింది. కేతిక శర్మ చేసిన ఈ పాట ఇలా వచ్చిందో లేదో ఇలా ట్రోలింగ్‌కు గురైంది. కానీ ఇవేవి పట్టించుకోకుండా కొంతమంది అమ్మాయిలు ఆ పాటను రీల్స్‌తో రీ-క్రియేట్ చేస్తున్నారు. డాన్స్ మూమెంట్స్ అశ్లీలంగా ఉన్నాయనే చర్చ నడుస్తున్న టైంలో డ్యాన్సర్ జ్యోతిరాజ్ రీల్స్ చేస్తున్న అమ్మా యిలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టార్ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ స్టెప్పులు ఈ మధ్య శృతి మించుతున్నాయని ఫైరవ్వడంతో పాటు... హీరోలు ఎలాంటి స్టెప్స్ వేసినా చూడ్డానికి ఓకే! కానీ అమ్మాయిలతో ఇంత దారుణమైన మూమెంట్స్ చేయించడం కరెక్ట్ కాదన్నారు. పైగా ఇలాంటి పాటలకు రీల్స్ చేస్తున్న వారికి తనదైన స్టైల్‌లో స్వీట్ వార్నింగ్ ఇచ్చింది. సినిమాల వరకూ ఓకే... కానీ బయట ఇలాంటి పాటలకు డ్యాన్స్ వేస్తే... గలీజ్‌గా ఉంటుందని కౌంటర్ ఇచ్చారు. అశ్లీలమైన రోత స్టెప్పులకు రీల్స్ చేయొద్దంటూ వేడుకుంది. జ్యోతిరాజ్ చేసిన కామెంట్స్‌కు పలువురు నెటిజన్లు సపోర్ట్‌గా నిలుస్తున్నారు. అమ్మాయిలు కాస్త చూసి రీల్స్ చేయండి అంటూ నెటిజన్లు సైతం కామెంట్స్ పెడుతున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala, Dharmasag Hanmakonda, 506151.Editor:BOLLEPAKA RAJESH. RNI:TELTEL/2013/ 88710. Contact: 9493669669. Email: telanganamuchatlu.in@gmail.com.Website : www.telanganamuchatlu.in